


చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## చేనేత సహకార సంఘాల ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్


- చేనేతలకు వర్క్‌షెడ్లతో పాటు సోలార్ లైటింగ్ యూనిట్లు
- ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు
- మంత్రి సవిత వెల్లడి

6

### పంటల వివరాలపై

# ‘శాటిలైట్ సర్వే’





- ల్యాండ్ రీ సర్వే తర్వాత వ్యవసాయ రికార్డుల నవీకరణ
- 47 లక్షలకు పైగా ‘అన్నదాత సుఖీభవ’ లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తి
- త్వరలో సాగునీటి సంఘాలతో నేరుగా వర్చువల్ సమావేశాలు
- యాప్ ద్వారా మత్స్యకారులకు సముద్ర మత్స్యసంపద వివరాలు
- వ్యవసాయం-అనుబంధ రంగాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- 4 గంటలకుపైగా లోతైన చర్చ-రైతులకు మేలు చేసేలా సూచనలు
- నీటి నిర్వహణపై జలవనరుల శాఖ అధికారులతోనూ సమీక్ష
- కాల్వలు అన్నింటికీ నీటిని వదలాలని సీఎం ఆదేశం

2

## నాడు సాయం పొందాడు..
## నేడు సాయానికి ముందుకొచ్చాడు...

నలుగురిని చదివించేందుకు ముందుకొచ్చిన
విదేశీ విద్యా పథకం లబ్ధిదారుడు సాత్విక్
విదేశీ విద్యపై ఆసక్తివున్న పేదలకు అండగా ఉంటానంటున్న సాత్విక్





యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రి మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. అబ్దుల్లావెంట లులు ఇంటర్నేషనల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యూసుఫ్ అలీ, లులు ఫైనాన్షియల్ హెూల్డింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అదీబ్ అహ్మద్‌లు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఫారిన్, కార్పొరేట్ ఇన్వెస్టర్స్‌ను కలవడం ఆనందంగా ఉందన్న సీఎం చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి, అభివృద్ధి అవకాశాలపై సుహృద్భావ వాతావరణంలో చర్చించారు. ఏపీ లక్ష్యాలను వివరిస్తూనే.. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం.. ఇన్వెస్టర్లపట్ల ప్రభుత్వం అనుసరిస్తోన్న ఫ్రెండ్లీ విధానాలపై సీఎం చంద్రబాబు లోతుగా చర్చించారు.



### పెట్టుబడులు, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాం: మంత్రి లోకేష్

3

### మంగళగిరిపై..

# ఐటీ కంపెనీల ఆసక్తి



- ఇతర కంపెనీలూ మొగ్గు చూపుతున్నాయి
- 50వేల మంది పనిచేసేందుకు అవకాశం
- అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు
- నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం
- మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్షలో మంత్రి నారా లోకేష్

3

## తోతాపురి రైతుకు తీపికబురు

- క్వింటా మామిడికి రూ.1,490 మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 50:50 నిష్పత్తిలో చెల్లించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



- నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్న నగదు
- ఫలించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషి
- సీఎం చంద్రబాబుకి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు

5

## మాంగల్యాలను మంటగలిపిన.. || మద్యం కుంభకోణం!!

*మద్యం స్కాంపై సిట్ కట్టుకథలు అల్లుతుందంటూ -జగన్ బాబా 40 దొంగల ముఠా పచ్చి పచ్చి అబద్ధాలను ప్రజల మెదళ్లలోకి జొప్పించే కుట్రకు తెరలేపుతోంది. విషతుల్యమైన మద్యాన్ని అమ్ముకుని వేల కోట్లు వెనకేసుకున్నది నిజం కాకపోతే.. -డిజిటల్ పేమెంట్ విధానం ఎందుకు రద్దు చేసినట్టు? కంప్యూటర్ ఆటోమేటెడ్ విధానం రద్దుచేసి మాన్యువల్ విధానం ఎందుకు ముందుకు తెచ్చినట్టు? నగదు లావాదేవీలనే ఎందుకు నెరిపారు? విషపూరిత మద్యం సరఫరాదారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి.. అధిక భాగం ఆర్డర్లు వాళ్లకే ఎందుకిచ్చారు? మద్య నిషేధం హామీపై మాటెందుకు తప్పినట్టు? కొవిడ్‌లోనూ మద్యం ఎందుకు అమ్మినట్టు?? విషతుల్యమైన మద్యాన్ని బలవంతంగా ప్రజల గొంతుల్లోకి దించి.. వేల ప్రాణాలు బలిగొన్నది నిజం కాదా? వేల కోట్ల దోపిడీకి ఒడిగట్టారని చెప్పడానికి ఇంతటి దారుణాలకు మించిన సాక్ష్యాలు కావాలా?*

4

జిల్లాలు, మండలాల పేర్ల మార్పుపై..

## మంత్రివర్గ ఉపసంఘం

సభ్యులుగా ఏడుగురు మంత్రులు - కన్వీనర్‌గా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

5

# పంటల వివరాలపై 'శాటిలైట్ సర్వే'

- ల్యాండ్ రీ సర్వే తర్వాత వ్యవసాయ రికార్డుల నవీకరణ
- 47 లక్షలకు పైగా 'అన్నదాత సుఖీభవ' లబ్దిదారుల ఈకేవైసీ పూర్తి
- త్వరలో సాగునీటి సంఘాలతో నేరుగా వర్చువల్ సమావేశాలు
- యాప్ ద్వారా మత్స్యకారులకు సముద్ర మత్స్యసంపద వివరాలు
- వ్యవసాయం - అనుబంధ రంగాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- 4 గంటలకుపైగా లోతైన చర్చ - రైతులకు మేలు చేసేలా సూచనలు
- నీటి నిర్వహణపై జలవనరుల శాఖ అధికారులతోనూ సమీక్ష
- కాల్వలు అన్నింటికీ నీటిని వదలాలని సీఎం ఆదేశం



వ్యవసాయ, అనుబంధ శాఖలపై మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు. హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు.

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రమంతటా ఏ సర్వేనెంబరు భూమిలో ఏయేపంటలు పండిస్తున్నారనే వివరాలు శాటిలైట్ సర్వే ద్వారా సేకరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం భలభద్రాపురంలో చేపట్టిన శాటిలైట్ సర్వేతో సమగ్రసమాచారం వెల్లడైందన్నారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, శాటిలైట్ సర్వే సమాచారం సరిపోల్చాలని స్పష్టం చేశారు. ఒక ప్రాంతంలో ఒకేతరహా పంటలు వేసేలా రైతులకు దిశా నిర్దేశం చేయాలని చెప్పారు. రైతు సేవా కేంద్రం నుంచి ఈమేరకు నిరంతరం సూచనలు, సహకారం అందించాలన్నారు. రీసర్వే అనంతరం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన జరిగిన తర్వాత వ్యవసాయ రికార్డులు కూడా నవీకరించాలని అధికారులను ముఖమంత్రి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నాలుగు గంటలకు పైగా వ్యవసాయం- అనుబంధ రంగాలపై లోతైన చర్చ జరిపి... రైతులకు మేలు చేసేలా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అలాగే, జలవనరుల శాఖ అధికారులతోనూ సమీక్ష నిర్వహించి నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు.

## రైతులకు ఉపయుక్తంగా ఏఐ చాట్ బోట్

పంటల ప్రణాళిక, ఉత్పత్తులకు విలువ జోడింపు, రైతులకు సహకారం అందించేందుకు ఏఐ చాట్ బోట్ వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని వారికి అందేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఇప్పటి వరకూ 47,41,792 మంది రైతుల వివరాలతో 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ఈకేవైసీ పూర్తయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ-పంట ద్వారా అర్హులను గుర్తించాలని, రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

## సాగునీటి సంఘాలతో నేరుగా మాట్లాడతా

వ్యవసాయరంగం అభివృద్ధికి తాను అత్యధిక ప్రాధాన్యతనిస్తానని... త్వరలో సాగునీటి సంఘాలతో వర్చువల్ సమావేశాలు సైతం నిర్వహించి నేరుగా మాట్లాడతానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో దక్షిణ కోస్తాలోని కొన్ని జిల్లాలు మినహా రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్‌లలో ప్రధాన ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని.. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందన్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రాష్ట్రంలో 9.9 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగు జరుగుతోందని చెప్పారు. అయితే, వర్షాధారంగానే పంటలు పండించేలా పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనిని సంబంధించి అవసరమైతే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపి...అవగాహన కల్పించాలన్నారు. సీజన్ కాలాన్ని ముందుకు తీసుకురాగలిగితే తుపాన్లు, భారీ వర్షాలనుంచి రైతులు పంట నష్టపోకుండా జాగ్రత్త పడొచ్చని, అదే సమయంలో మరో పంటకు అవకాశం ఉంటుందని చెప్పారు. కరవు అనే మాట ఉండకూడదని, సమృద్ధిగా కురుస్తున్న వర్షపునీటి సద్వినియోగం ద్వారా ప్రాజెక్టుల నుంచి అతి తక్కువ నీటిని వాడుకునేలా ప్రణాళికలు ఉండాలన్నారు.

## ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గాలి

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగిస్తున్నారని... ఈ కారణంగా భూసారం తగ్గిపోతోందని... ఎరువులు, పురుగు మందులు ఏమేరకు వాడాలో రైతులకు వివరించి... వాటిని అధికంగా వినియోగించకుండా నియంత్రించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 36.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, అంతకుముందు ఏడాదితో 12 శాతం మేర తగ్గిందని అధికారులు వెల్లడించారు. అలాగే, 2024-25లో 1,733 మెట్రిక్ టన్నుల పురుగుమందులు రాష్ట్రంలో వినియోగం జరిగిందని తెలిపారు. అయితే ఆర్గానిక్-బయో ఫెర్టిలైజర్ల వినియోగంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటలను చీడపీడలనుంచి రక్షించేలా ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్ సిస్టం తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. సాంకేతికతను వినియోగించుకుని పురుగు మందుల విస్తృతికి అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. విత్తనాలు, ఎరువుల విక్రయంపై చిట్టచివరి వరకూ ట్రాకింగ్ జరగాలన్నారు. వరిలో కలుపు మొక్కల నివారణలో ప్రమాదకరమైన కెమికల్స్ వాడకంతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని అధికారులు తెలుపగా, ఎక్కడెక్కడ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయో సమాచారాన్ని సేకరించాలని... కేసులు ఎక్కువ నమోదవుతున్నచోట్ల రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## ఆర్గానిక్ సర్టిఫికేషన్‌తో అధిక ఆదాయం

పురుగుమందులు, ఎరువులు వినియోగించకుండా పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇస్తే ఆయా ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉంటుందన్నారు. తద్వారా రైతులకు అధిక ఆదాయం వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు సంబంధించి టాటాతో త్వరలో ఒప్పందం చేసుకునేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. ఎన్‌పీఓపీ సర్టిఫికేషన్లతో జపాన్, తైవాన్‌లాంటి దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చన్నారు. ఇండి గ్యాప్ సర్టిఫికేషన్‌తో పండ్లను 130 దేశాలకు ఎగుమతి చేసే అవకాశం లభిస్తుందన్నారు. విలువ జోడింపు ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలని సీఎం సూచించారు. చిత్తూరు జిల్లాలో మామిడి, మిర్చిలాంటి ఉత్పత్తులకు డిమాండ్ పెరిగేలా చూడాలన్నారు. దేశీయంగా డిమాండ్ లేని ఉత్పత్తులను సర్టిఫికేషన్ ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

## నిరంతరం క్రాప్ హెల్త్ మోనిటరింగ్

రాష్ట్రంలో క్రాప్ హెల్త్ మోనిటరింగ్ నిరంతరం జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకోసం 42 ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. నీటి సంరక్షణ నిర్మాణాల ద్వారా భూగర్భజలాలు పెరిగేలా చూడాలని, 1000 టీఎంసీ మేర భూగర్భజలాలు ఉండాలనేది మన లక్ష్యమని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. అలాగే కాలువలను పూడిక తీయించి అంతరాయం లేకుండా ప్రవాహాలు వెళ్లేలా చూడాలన్నారు. వ్యవసాయం- జలవనరుల శాఖ సమన్వయంతో పనిచేయాలని... అప్పుడే రైతులకు ఫలితాలు వస్తాయన్నారు. నీటి పంపిణీపై సాగునీటి సంఘాలతో కలిసి కసరత్తు చేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్లను విస్తృతంగా వినియోగించేలా చూడాలని, ప్రస్తుతం వ్యవసాయంతోపాటు 15 రంగాల్లో డ్రోన్లను వినియోగించేందుకు అవకాశం ఉందని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. డ్రోన్లతో సాగు సులభం అవుతుందన్నారు.

## పొగాకు, మామిడి కొనుగోళ్లపై కలెక్టర్లకు ఆదేశాలు

ఈ సీజన్‌లో వ్యవసాయ అధికారులను ఇతర వ్యవసాయేతర విధులకు వినియోగించొద్దని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. హెచ్డీ బర్లీ, మ్యాంగో రైతులకు చెల్లింపులపైనా సీఎం మాట్లాడారు. మార్క్ ఫెడ్ నుంచి రెండు విడతల్లో బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆగస్టు 20లోగా హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తోతాపురి మామిడి కొనుగోళ్లపై ఆయా జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన ముఖ్యమంత్రి ఆగస్టు 15లోగా మామిడి రైతులకు కూడా డబ్బులు చెల్లించాలని చెప్పారు. విలువ జోడింపులో భాగంగా కవర్ బ్యాగుల్లో పండించిన తోతాపురి మామిడి పళ్ల నాణ్యతను సీఎం పరిశీలించారు. టేబుల్ వెరైటీ పండించడం ద్వారా దేశీయంగా, పల్ప్‌లాంటి ఉత్పత్తులతో విదేశాలకు ఉత్పత్తులు పంపేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతుల నుంచి కొనుగోళ్లు జరపని కంపెనీలపైనా కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

## సూక్ష్మ సేద్యమే గేమ్ చేంజర్

ఉద్యాన పంటలకు సూక్ష్మ సేద్యం గేమ్ చేంజర్ అవుతుందని... ప్రస్తుతం 16.17 లక్షల హెక్టార్లలో దీని కింద సాగువుతుందని... మరింత విస్తరించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. నీళ్లులేని చోట మైక్రో ఇరిగేషన్, నీటి వనరుల లభ్యత అధికంగా ఉన్నచోట్ల ఫ్లడ్ ఇరిగేషన్ అమలుకు అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమలో సూక్ష్మ సేద్యంతో పాటు కాలువల ద్వారా నీరిస్తే రైతులకు మరింత లాభదాయకంగా మారుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చిట్టచివరి ఆయకట్టువరకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా గుంటూరు ప్రాంతానికి సాగునీరు అందించాలన్నారు.

## అపార్ట్‌మెంట్ల చెంతకు మొబైల్ రైతుబజార్లు

వ్యవసాయం- అనుబంధ ఉత్పత్తులు నగరాల్లో ఇంటి ముంగిటకు తీసుకువెళ్లి నేరుగా రైతులే విక్రయించేలా చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గృహసముదాయాల దగ్గర విక్రయాలకు అవకాశం కల్పించాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరగకుండా.. తగ్గిపోకుండా ఈ ప్రక్రియ ఉపకరిస్తుందన్నారు. అలాగే అన్ని నియోజకవర్గ కేంద్రాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో మొబైల్ రైతు బజార్లు ప్రవేశపెట్టాలని చెప్పారు. 30 రోజుల్లోగా దీనిపై కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు

## నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే సబ్సిడీ

మెరుగైన ఆదాయం వచ్చే వాణిజ్య పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఆక్వా ఉత్తత్పుల నాణ్యత విషయంలో రాజీ లేదని... ఉత్పత్తుల నాణ్యత అంతర్జాతీయ ఎగుమతులకు తగ్గట్టు ఉండాలన్నారు. చికెన్ వ్యర్థాలను ఫీడ్‌గా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించే ఆక్వా రైతులకే సబ్సిడీ విద్యుత్ అందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. సముద్రంలో మత్స్య సంపద ఏ ప్రాంతంలో ఎక్కువలభిస్తుందో మత్స్యకారులకు యాప్ ద్వారా తెలియజేయాలన్నారు.సముద్రంలో ఉత్పత్తయ్యే సీవీడ్ ఎక్కువమంది సాగుచేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో వినియోగించడంతోపాటు, బయో ఫ్యూయల్‌గా కూడా సీవీడ్‌ను వినియోగించేలా అధ్యయనం జరగాలని చెప్పారు.ఉద్యానరంగంతో సమానంగా పశుపోషణకు, ఆక్వా ఉత్పత్తులకు ప్రాధాన్యతఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. లైవ్‌స్టాక్‌లో 15 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ఇకపై ప్రత్యేకంగా సమీక్షిస్తానని అన్నారు.

## 'కోకో ముంజ్'పై ముఖ్యమంత్రి ప్రశంసలు

సమీక్షలో కొబ్బరితో తయారు చేస్తున్న 'కోకో ముంజ్' సంస్థ ఉత్పత్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి... సంస్థ ప్రతినిధిని అభినందించారు. ఈ సమీక్షకు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయం- అనుబంధ రంగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నాడు సాయం పొందాడు...
# నేడు సాయానికి ముందుకొచ్చాడు...

- నలుగురిని చదివించేందుకు ముందుకొచ్చిన విదేశీ విద్యా పథకం లబ్ధిదారుడు సాత్విక్
- విదేశీ విద్యపై ఆసక్తివున్న పేదలకు అండగా ఉంటానంటున్న సాత్విక్



అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వమిచ్చే సంక్షేమ పథకాలు పేదల అభ్యున్నతికి ఉపయోగపడాలి. అప్పుడే ఆ పథకాలకు సార్థకత చేకూరుతుంది. 2014-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఇప్పుడు ఆ పథకాలు సత్ఫలితాలిస్తున్నాయి. నాడు ఆర్థిక సాయం పొందిన చేతులు.. ఇప్పుడు పేదలకు సాయం చేయడానికి ముందుకొస్తున్నాయి. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును యువ వ్యాపారవేత్త సాత్విక్ మురారి కలిశారు. 2016లో విదేశీ విద్యా పథకం కింద ఐర్లాండులో చదువుకోవడానికి నాటి టీడీపీ ప్రభుత్వం సహకరించిందని ముఖ్యమంత్రికి సాత్విక్ వివరించారు. ప్రభుత్వం అందించిన సాయంతో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఐర్లాండులో ఎంఎస్ విద్యను అభ్యసించానని చెప్పారు. తర్వాత అక్కడే ఉద్యోగం చేసిన తాను.. ఇప్పుడు ఐర్లాండులో వ్యాపారాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. నాడు ప్రభుత్వంనుంచి సాయం పొందిన తాను.. ఇప్పుడు విదేశాల్లో చదవాలని ఆసక్తి చూపించే పేద విద్యార్థులకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్టు సాత్విక్ చెప్పారు. ఈమేరకు మెరిట్ కలిగిన పేద విద్యార్థులను ఎంపికచేసి విదేశాల్లో వారికి చేయూతనిచ్చేలా స్కాలర్ షిప్ పేరుతో ఆర్థిక సాయం అందివ్వనున్నట్టు చెప్పారు. ఈమేరకు తాము నలుగురు పేదలకు విదేశాల్లో చదువుకునేందుకు స్కాలర్ షిప్ అందించేందుకు ముందుకు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. తిరిగి సమాజానికి కొంత ఇవ్వాలి అనే ఆలోచన వచ్చిన యువకుడిని ప్రశంసించారు. సీఎంను కలిసిన వారిలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు స్వామిదాస్ ఉన్నారు.



# సీఎం చంద్రబాబుతోనే
# రాష్ట్రాభివృద్ధి



- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- గాజువాకలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన
- ఇది మంచి ప్రభుత్వం అని మద్దతు తెలిపిన స్థానికులు
- పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవి, విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్

గాజువాక (చైతన్యరథం): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని, అదే సమయం లో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువ జన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఏపీ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఉద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా విశాఖ నగర పరిధి గాజువాకలోని 70వ వార్డులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం మంత్రి మండిపల్లి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. కూటమి పాలనతో తాము సంతృప్తిగా ఉన్నామని తెలిపారు. మంత్రి మండిపల్లి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమాన్ని అందిస్తూనే, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను రప్పిస్తూ పరిశ్రమల ఏర్పాటుకు, అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి, విశాఖ మేయర్ పీలా శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### యూఏఈ ఆర్థికమంత్రి, లులు సీఎండీలకు మంత్రి లోకేష్ హృదయపూర్వక స్వాగతం

**- పెట్టుబడులు, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించామని వెల్లడి**

అమరావతి(చైతన్యరథం): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్‌తౌక్ అల్ మర్రి, లులు ఇంటర్నేషనల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యూసుఫ్ అలీ ఎం.ఎ, లులు ఫైనాన్షియల్ హోల్డింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అదీబ్ అహ్మద్‌తో కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు, అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించామని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అంతకుముందు సీఎం చంద్రబాబుతో కలిసి వారికి హృదయపూర్వక స్వాగతం పలికామని ఎక్స్‌లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. భారతదేశంలో, అదే విధంగా ఆగ్నేయాసియాలో ఆంధ్రప్రదేశ్‌ను కీలకమైన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసే విషయమైవారితో సమగ్రంగా చర్చించామన్నారు. ఐటీ, తయారీ, పర్యాటకం, అగ్రి బిజినెస్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలు కల్పించడంపైనా విస్తృతంగా చర్చలు జరిపామని లోకేష్ వెల్లడించారు.



# మంగళగిరిపై ఐటీ కంపెనీల ఆసక్తి

- ఇతర కంపెనీలూ మొగ్గు చూపుతున్నాయి
- 50వేల మంది పనిచేసేందుకు అవకాశం
- అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు
- నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం
- మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్షలో మంత్రి నారా లోకేష్



ఉండవల్లి (చైతన్యరథం): ఐటీ, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, ఈ రంగంలో భవిష్యత్‌లో 50వేల మంది ఉద్యోగులు పనిచేసేందుకు అవకాశం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన పలుఅభివృద్ధి పనుల పురోగతిపై ఉండవల్లి నివాసంలో అధికారులతో మంగళవారం మంత్రి సమీక్షించారు. వివిధ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరికి ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. మంగళగిరిలో వివిధ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారికి రెండో విడతలో 2వేల ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇళ్లపట్టాల విషయం లోనూ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

### నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం!

ప్రజలు నివసించేందుకు అనుకూలంగా వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉంది, ఇందుకు అవసరమైన స్థల సేకరణపై అధికారులు దృష్టి సారించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. తాడేపల్లి రిటైనింగ్ వాల్, మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, మోడ్రన్ లైబ్రరీ, పార్క్‌లు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులపైనా మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

## మాంగల్యాలను మంటగలిపిన..

# మద్యం కుంభకోణం!!

**జగన్ బాబా 40 దొంగల కుతర్కం:** లేని మద్యం స్కాంపై సిట్ కట్టుకథలు

**నిజాలు:** స్కాం లేకపోతే డిజిటల్ పేమెంట్ విధానం ఎందుకు రద్దు చేశారు? కంప్యూటర్ ఆటోమేటెడ్ విధానం రద్దుచేసి మాన్యువల్ విధానం ఎందుకు పెట్టారు? నగదులోనే ఎందుకు లావాదేవీలు నడిపారు? విషపూరిత మద్యం సరఫరాదారులపై చర్యలు తీసుకోకుండా.. వారికే అధిక భాగం ఆర్డర్లు ఎందుకు ఇచ్చారు? మద్య నిషేధం హామీపై ఎందుకు మాట తప్పారు? కొవిడ్‌లోనూ మద్యం అమ్మకాలు జరిపి.. వేలాది ప్రజల ప్రాణాలు ఎందుకు మంటగలిపారు? వేల కోట్ల దోపిడీ లేకుంటే ఇన్ని దారుణాలకు పాల్పడతారా?

**కుతర్కం:** లిక్కర్ సేల్స్ తగ్గాయి. ప్రభుత్వ ఆదాయం పెరిగింది. మరి అవినీతి ఎలా జరుగుతుంది?

**నిజాలు:** రూ.60 ఉన్న చీప్ లిక్కర్ క్వార్టర్ ధర రూ.180లకు పెంచారు. ఇలా ధరలు పెంచడంవల్ల కొంత ఆదాయం పెరిగింది. ధరలు పెంచింది కమీషన్లు దండుకోవడానికే. అధికారిక సేల్స్ ఎంత జరిగిందో.. అనధికార లిక్కర్ సేల్స్ అదే మోతాదులో జరిగింది. నాలుగు లక్షల మొబైల్ షాపులు/ బెల్ట్‌షాపులు నడిపారు. సేల్స్ తగ్గిందనేది కట్టుకథ మాత్రమే. సిట్ ఈ కోణంలో కూడా విచారణ చేస్తే దోపిడీ మరికొన్ని వేల కోట్లకు పెరుగుతుంది.

**కుతర్కం:** ఒక్క సాక్ష్యం చూపకుండా మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారు. జగన్‌కు సన్నిహితుడనే రాజకీయ కక్షతో కేసు పెట్టారు.

**నిజాలు:** ఎస్పీవై ఆగ్రో, సాన్‌హాక్ ల్యాబ్స్, డికార్ట్ లాజిస్టిక్స్ ద్వారా మద్యం ముడుపులు మిథున్ కుటుంబ సంస్థలైన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్, శివశక్తి డెయిరీలకు చేరిన వైనం సిట్ చూపడం సాక్ష్యం కాదా?

మద్యం దోపిడీ పాత్రదారులతో మిథున్‌రెడ్డి సమావేశాలు, ఫోన్‌కాల్స్ చాటింగులను సిట్ రుజువులుగా చూపించడం నిజం కాదా?

అసిస్టెంట్ కమిషనర్ సత్యప్రసాద్‌ను మిథున్‌రెడ్డి తిరుపతిలోని తన ఇంటికి ఎందుకు పిలిపించుకున్నారు?

2023 మే 21న మిథున్‌రెడ్డి, కెసిరెడ్డి, చాణిక్య హైదరాబాద్ ఎవరెస్టు భవన్‌లో కలిసింది వాస్తవం కాదా?

2023 జూన్ 18న సైప్‌తో మిథున్ రెడ్డి హైదరాబాద్ అపోలో సమీపంలో సమావేశమైంది నిజం కాదా?

సాక్ష్యం చూపకుండా మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారనేది అబద్ధం. దోపిడీని కప్పిపెట్టుకుని ముసుగే. రాజకీయ కక్ష సాధింపు ఆరోపణ.

**కుతర్కం:** డిస్టలరీలన్నీ టీడీపీ వారివే. జగన్ ప్రభుత్వం ఒక్కదానికి కూడా లైసెన్స్ ఇవ్వలేదు.

**నిజాలు:** డిస్టిలరీ యజమానులందరి మెడపై కత్తిపెట్టి వాటన్నింటినీ లీజు పేరుతో దురాక్రమణ చేసింది నిజం. వీటిల్లో విషపూరిత మద్యం తయారుచేసి 30 వేలమంది మాంగల్యాలు మంటగలిపారు. 35 లక్షలమంది పేదల ఆరోగ్యాల్ని నాశనం చేసింది నిజం.

జగన్ ప్రభుత్వం ఒక్క డిస్టిలరీకి కూడా లైసెన్స్ ఇవ్వలేదనేది పచ్చి అబద్ధం. 1. 2020 మేలో టెండర్, బ్రాండ్ ట్రయల్ లేకుండానే ఆదాన్ డిస్టిలరీకి లైసెన్స్ ఇచ్చారు. 2. 2020 సెప్టెంబరులో లీలా డిస్టిలరీ. 3. 2021 జనవరిలో క్రిపాటీ బెవరేజెస్. 4. 2021 అక్టోబర్‌లో ఓల్విక్ డిస్టిలరీస్. 5. 2019 డిసెంబర్‌లో జోర్ హార్ట్ స్పిరిట్స్. 6. 2021 ఏప్రిల్‌లో ఫైన్ బార్ స్పిరిట్స్. 7. 2021 ఫిబ్రవరిలో టెక్కర్ ఎక్స్‌పోర్ట్స్. 8. 2020 నవంబర్‌లో డికార్ట్ లాజిస్టిక్స్. 9. 2021 మార్చిలో ట్రీఫర్ బెవరేజెస్. 10. 2020 జూన్‌లో న్యాసనా డిస్టిలరీకి లైసెన్సులు మంజూరు చేశారు. ఒక్క దానికీ లైసెన్స్ ఇవ్వలేదనే జగన్ ముఠా మాటలు పచ్చి అబద్ధం.






**కుతర్కం:** సెల్‌టవర్ లొకేషన్ కాల్ డేటా వక్రీకరించారు.

**నిజాలు:** సెల్ టవర్ లొకేషన్, కాల్‌డేటా, చాటింగ్, సత్యప్రసాద్.. వాసుదేవరెడ్డి వాంగ్మూలాలు, విషపూరిత మద్యం అని చెన్నై, బెంగళూరు, అమెరికా ల్యాబ్ రిపోర్టులన్నీ నిజాలు కాదట. జగన్ ముఠా, సాక్షి రాతలే నిజాలట.

గొడ్డలి వేటును గుండెపోటుగా చిత్రీకరించారు. నారాసుర రక్తచరిత్ర అని రాయించారు. డాక్టర్ సునీతమ్మ తన తండ్రిని హత్య చేయించిందన్న జగన్ ముఠా.. ప్రతి దాన్నీ వక్రీకరించి దాన్ని ఎదుటివారికి అంటగట్టడం పనిగా పెట్టుకున్నారు. వేయి గొడ్లు తిన్న రాబందు ఒక్క గాలివానకు కూలక తప్పదు.

**కుతర్కం:** 2014-19 మధ్య మద్యం దోపిడీ చేసింది చంద్రబాబే.

**నిజాలు:** దొంగే.. దొంగ దొంగ అన్న కుట్రను జగన్ ముఠా తమ నేరాలకు కవచంగా వాడుకుంటున్నది. చంద్రబాబుపై జగన్, ఆయన తండ్రీ డజన్ల కొద్దీ అక్రమ కేసులు పెట్టారు. ఒక్కదానికి కూడా కనీస రుజువులు చూపలేక కోర్టుల్లో మొట్టికాయలు వేయించుకున్నారు. జగన్, గాలి జనార్ధన్‌రెడ్డి దోపిడీపై టీడీపీ రుజువులు చూపింది. గాలికి జైలు శిక్ష పడింది. జగన్ కోర్టు వాయిదాలను ఎందుకు తప్పించుకుని తిరుగుతున్నారు?

**కుతర్కం:** రూ.3500 కోట్లు అంటూ సిట్ బేతాళ కథలు చెబుతుంది.

**నిజాలు:** డెన్‌లలో గుట్టలుగా పెట్టిన నోట్లకట్టల వీడియోలు పచ్చి నిజాలు. షెల్ కంపెనీలు పెట్టింది నిజం. టన్నులకొద్దీ బంగారం కొన్నది నిజం. సినిమాలు తీసింది నిజం. ఇలా ఎన్నో ఉన్నాయి.

ఇప్పటికి రుజువులు దొరికింది రూ.3,500 కోట్లకే. ఇంతకు అనేక రెట్ల మద్యం దోపిడీ జరిగింది. రూ.3500 కోట్ల దోపిడీ అధికారిక అమ్మకాల్లో కమీషన్ మాత్రమే. అనధికార అమ్మకాల ద్వారా హెూల్‌సేల్‌గా మరెన్నో వేల కోట్ల దోపిడీ జరిగింది. ఆ దోపిడీ తేలాల్సి ఉంది.

2024-25 జగన్ పాలనలోని మొదటి మూడు మాసాలతో పోలిస్తే 2025-26 కూటమి ప్రభుత్వంలో తొలి మూడు మాసాల్లో లిక్కర్ అమ్మకాలు 24శాతం, బీరు 129 శాతం పెరిగింది. జగన్ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో జే బ్రాండ్లు ప్రభుత్వ లెక్కల్లో చూపకుండా అనధికారికంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. అందువల్లే జగన్ పాలనలో తక్కువ అమ్మకాలు నమోదయ్యాయి.

**కుతర్కం:** జగన్‌కు సన్నిహితుడు కాబట్టే రాజకీయ కక్షతో మిథున్‌రెడ్డిపై అనేక కేసులు పెట్టారు.

**నిజాలు:** సహవాస దోషం తప్పదు కదా! సహవాస దోషంతోనే అనుకూల ఐపీఎస్‌లు, పారిశ్రామికవేత్తలు జైలుకు వెళ్లారు. కొందరికి కోర్టు శిక్షలు కూడా వేసింది.

మిథున్‌రెడ్డి కుటుంబ కంపెనీలైన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్, శివశక్తి డెయిరీలకు.. మద్యం ముడుపులతో సంబంధమున్న కంపెనీల నుంచి ముడుపులు జమ అయ్యింది నిజం. అక్రమ మద్యం దోపిడీలో భాగస్తులైన వారితో మిథున్‌రెడ్డి సమావేశాలు, ఫోన్ సంభాషణలు నిజం. రాజకీయ కక్ష అనేది అబద్ధం. రాజకీయ కక్ష అనే ముసుగు తొడుక్కుని నేరస్తులు తప్పించుకునే ప్రయత్నాలను ప్రజలు ఆమోదించరు. జగన్ నిజాయితీపరుడైతే సీబీఐ కోర్టు విచారణలకు హాజరుకావాలి. ఎందుకు కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా 10ఏళ్లుగా కుంటిసాకులతో తప్పించుకుంటున్నారు?

**ఏం చేయాలి?**

రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా దోపిడీ సొమ్ము జప్తు చేసి విషపూరిత మద్యంతో మాంగల్యాలు మంటగలిపిన కుటుంబాలు, ఆరోగ్యాలు గుల్లయిన బాధితుల సంక్షేమానికి, డి అడిక్షన్ సెంటర్ల నిర్వహణకు ఖర్చు చేయాలి.

మద్యం కుంభకోణంలో పాత్రధారులే కాక అంతిమ లబ్ధిదారులను కోర్టు బోనులో నిలబెట్టాలి.

దోపిడీదారులకు కులాలు ఉండవు. విషపూరిత మద్యం తాగి అన్ని కులాల వారూ ప్రాణాలు కోల్పోయారు. కులం ముసుగు కప్పుకునే కుట్రలను ప్రజలు అంగీకరించరాదు.


మద్యం మాఫియాలకు శిక్షలు పడకపోతే ప్రజల ధన, మాన, ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఉండదు. కనుక అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలి.

**కుతర్కం:** కూటమి ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపెట్టుకోవడానికి అక్రమ కేసులు పెడుతున్నారు.

**నిజాలు:** ప్రభుత్వ ఖజానాను జగన్ దివాలా తీయించి పోయినా.. చంద్రబాబు తన అనుభవంతో మేనిఫెస్టో హామీలు తొలి ఏడాది 70శాతం అమలు చేశారు. ఈ స్థాయిలో తొలి ఏడాదే ఇన్ని హామీలు అమలు చేసిన ప్రభుత్వం ఏపీ చరిత్రలో మరొకటి లేదు. ప్రభుత్వం వైఫల్యం చెందిందని జగన్ ముఠా ప్రచారం పచ్చి అబద్ధం మాత్రమే.

జగన్ తన తొలి ఏడాది పాలనలో మేనిఫెస్టో హామీలు 10శాతం మాత్రమే అమలు చేశారు. మద్య నిషేధంపై మాట తప్పారు. ఇద్దరు బిడ్డలకు అమ్మఒడి హామీపై మాట తప్పారు. అమ్మఒడికి రూ.13000 ఇచ్చి నాన్న బుడ్డిలో లక్ష కొట్టేశారు. ఇలా నవరత్నాలను నవ మోసాలు చేసింది జగన్ ప్రభుత్వమే. అక్రమ కేసులకు కేరాఫ్ అడ్రస్ జగన్ మాత్రమే!

- గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్



# తోతాపురి రైతుకు తీపికబురు

- క్వింటా మామిడికి రూ.1,490 ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 50:50 నిష్పత్తిలో మద్దతు ధర చెల్లించనున్న కేంద్రరాష్ట్రాలు
- నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్న నగదు
- ఫలించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషి
- సీఎం చంద్రబాబుకి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మామిడి రైతులు



అమరావతి (చైతన్యరథం): తోతాపురి మామిడి రైతులకు కేంద్రం తీపికబురు చెప్పింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ ధర (ఎంఐపీ) కింద క్వింటాకు రూ.1,490 చెల్లిస్తామని ప్రకటించింది. ఈ ఏడాది అత్యధిక దిగుబడి రావడంతో ధర తగ్గుముఖం పట్టడంతో ఇబ్బందులు పడుతున్న తోతాపురి మామిడి రైతులకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలబడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ముందే గ్రహించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చిత్తూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి రైతులతో, పల్ప్ ఫ్యాక్టరీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. దిగుబడి ఎక్కువ ఉండటంతో మామిడి పంటను పల్ప్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకు అడుగుతున్నారని తెలుసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు పల్ప్ ఫ్యాక్టరీలు కిలో మామిడిని 8 రూ కొనాలని, దానికి అదనంగా ప్రభుత్వం రూ.4 అందచేస్తుందని తెలిపారు. మొత్తంగా రైతులకు కిలోకు రూ. 12 రూ చొప్పున అందే విధంగా చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలసి తోతాపూరి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించి రైతులకు అదనంగా అందిస్తున్న మొత్తాన్ని 50:50 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి అచ్చెన్నాయుడు అభ్యర్థనని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం మంగళవారం తోతాపూరి మామిడి క్వింటాకు రూ.1,490 చొప్పున ఎంఐపీ ప్రకటించింది. రైతులకు అదనంగా చెల్లించే మొత్తాన్ని 50:50 నిష్పత్తిలో కేంద్రం, రాష్ట్రం భరించనున్నాయి, ఆ అదనపు ధర మొత్తం నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ కానుంది. ఈ విషయం పట్ల తోతాపూరి మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలబడిన కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడుకి, మంత్రి అచ్చెన్నాయుడుకి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మంత్రి అచ్చెన్నాయుడు హర్షం

తోతాపూరి మామిడి క్వింటాకు రూ.1,490 ధరను కేంద్రం ప్రకటించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మామిడి రైతుల నష్టం రాకూడదని ముందుగానే గ్రహించి



కేజీ మామిడిని రూ.12కి కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేజీ మామిడికి అదనంగా రూ.4 అందచేశామన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన ధరను మామిడి రైతులకు ఏపీ ప్రభుత్వం అందచేసిందని తెలిపారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజధానిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం



- కేపీసీ అధినేతతో డూండి రాకేష్ సమావేశం
- ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం

అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరజీవిలో పొట్టి శ్రీరాములు విగ్రహం, స్మృతివనానికి నమూనాల విషయమై కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అధినేత అనిల్‌తో మంగళవారం ఆర్య వైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు స్మృతివనానికి 6.8ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. కాగా స్మృతివనం నిర్మాణంపై సంస్థ ప్రతినిధులతో కూలకుషంగా చర్చించారు. గతంలో విజయవాడలో కట్టిన అంబేద్కర్ స్మృతివనంలో ఎదురైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొట్టి శ్రీరాములు స్మృతి వనం వీలైనంత తొందరలోనే నిర్మిస్తామని వారు తెలపడం జరిగిం ది. విగ్రహం పది కాలాల పాటు దృఢంగా ఉండే విధంగా తీసు కోవలసిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్కిటెక్చర్స్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి

- ఆర్థిక ఇబ్బందులున్నా హామీలన్నీ అమలు
- మున్సిపల్ మంత్రి నారాయణ
- పెడనలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ



పెడన(చైతన్యరథం):సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. కృష్ణా జిల్లా పెడనలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనపై ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా రూ.10లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్ళిపోయింది. సీఎం చంద్రబాబు అపార అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నప్పటికీ ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద రూ.10వేల కోట్లు ఖర్చు పెట్టాం. కేంద్రం పీఎం కిసాన్ నిధులు విడుదల చేసే రోజే అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమచేస్తాం. 2014-19 మధ్యలో కేంద్రం నుంచి ఏఐబీ, అమృత్ నిధులు ఇచ్చేలా ఒప్పించాం. కేంద్రం వాటా విడుదల చేసినా... గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో ఆ నిధులు నిలిచిపోయాయి.రాష్ట్రంలో ప్రతిఇంటికీ సురక్షిత తాగునీరు అందించేలా ముందుకెళ్తున్నాం. పెడనలో వచ్చే రెండేళ్లలో అందరికీ తాగునీరు అందించేలా 91.18 కోట్లతో పనులు చేపడుతున్నాం. పెడన మున్సిపాలిటీలో డ్రెయిన్ల నిర్మాణానికి రూ.2కోట్లు,ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనుల పూర్తికి రూ.25లక్షలు విడుదల చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

- సభ్యులుగా ఏడుగురు మంత్రులు
- కన్వీనర్‌గా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

జిల్లాలు, మండలాల పేర్ల మార్పుపై..

# మంత్రివర్గ ఉపసంఘం

అమరావతి(చైతన్యరథం): ఏపీలో జిల్లాలు,మండలాలు గ్రామాల సరిహద్దులు,పేర్లు మార్పులు చేర్పుల కోసం రాష్ట్రప్రభుత్వం చర్యలుచేపట్టింది. వీటిపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.స్థానిక ప్రజలు,ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ ఉపసంఘంలో సభ్యులుగా ఏడుగురు మంత్రులను నియమించింది. వీరిలో అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ ఉన్నారు. దీనికి కన్వీనర్‌గా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈఉపసంఘంలోని మంత్రులు పరిపాలనా సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని తెలిపింది.

జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతం చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వం సూచించింది. సామాజిక, ఆర్థిక, అభివృద్ధి కోసం అంతరాలు లేని విధంగా ప్రాంతాలను నిర్దేశించాలని, జనాభా సంఖ్య, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించింది. సరిహద్దులు, పేర్లపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ, సీసీఎల్ఎకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం పదిలం

- ప్రతి ఇంటా సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలుపై హర్షం
- రాష్ట్రంలో ఏడాదిలో రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులు
- రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్
- కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొన్న మంత్రి



కోవూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం పదిలంగా ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం పోతిరెడ్డిపాలెంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి టీజీ భరత్‌కు స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా పోతిరెడ్డిపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం.. రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పోతిరెడ్డిపాలెం బ్రాంచ్ రోడ్డు, పోతిరెడ్డిపాలెం నుంచి గిరిజన తిప్ప వెళ్లే రోడ్లను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో కలిసి మంత్రి భరత్ ప్రారంభించారు. అనంతరం పోతిరెడ్డి పాలెం గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రోడ్లకు శంకుస్థాపన చేశారు.

పోతిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీవాణి కాలనీలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, మంత్రి భరత్‌లకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ.. ఆప్యాయంగా పలకరించారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికులందరూ ఏడాది పాలనపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు పాలనలో సంతోషంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని నేతలు ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి భరత్ మాట్లాడుతూ... కోవూరు నియోజకవర్గ సమస్యలే పరిష్కారంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పనిచేస్తున్నారని, ఆ విషయాన్ని తాము ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. ఎప్పుడు, ఎక్కడ పలకరించినా.. ప్రజా సమస్యలనే ప్రస్తావిస్తుంటారన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనితీరును ఆయన కొనియాడారు. గత పాలనలో అధ్వానంగా మారిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పినా వారి తీరు మారడం లేదని, ఇటీవల ప్రశాంతిరెడ్డిని ఉద్దేశించి వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన అసభ్య వ్యాఖ్యలే అందుకు నిదర్శనమన్నారు.

**విజన్‌తో చంద్రబాబు పాలన**

సీఎం చంద్రబాబు ఒక విజన్‌తో పాలన సాగిస్తున్నారని, ఆయన విజన్‌కు నేటి హైదరాబాద్ నిదర్శనమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సుస్థిర ప్రభుత్వాలు అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రానికి ఈ ఏడాదిలో రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇది కేవలం చంద్రబాబు నాయుడు బ్రాండ్ వల్లే సాధ్యపడిందన్నారు. ఇది పనిచేసే ప్రభుత్వమన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆయనే చంద్రబాబే మన సీఎం అన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇఫ్కో కిసాన్ సెజ్ వివరాలపై ఆరా తీస్తామని అన్నారు.

**20 రోజుల్లోనే లక్ష గడపలకు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి భరత్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని మొదలు పెట్టిన 20 రోజుల్లోనే లక్ష ఇళ్లను పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ఇవ్వగలిగిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో తాను కూడా భాగం కావటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఏడాది కాలంలో సాధించిన విజయాలను వివరించేందుకు ప్రజల్లోకి వెళ్లాలని మీ వద్దకు పంపించినందుకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి నేడు ప్రజాక్షేత్రంలో ధైర్యంగా తిరుగుతున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80 శాతం వరకు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.

ఈ సందర్భంగా కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు, ఇఫ్కో కిసాన్ సెజ్, మిథాని పరిశ్రమల స్థాపన విషయాన్ని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. కోవూరు నియోజకవర్గంలో నైపుణ్యమున్న యువతకు కొదవ లేదని, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. షుగర్ ఫ్యాక్టరీ బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కిసాన్ సెజ్, మిథాని పరిశ్రమలు స్థాపిస్తే వేలాదిమందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కోవూరు నాయకులు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, జొన్నవాడ ఆలయ సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, పోతిరెడ్డి పాలెం ఎంపీటీసీ నాగరాజు, కోవూరు ఎంపీపీ తుమ్మల పార్వతి, టీడీపీ కోవూరు మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, బుచ్చి అర్బన్, రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, బెజవాడ జగదీష్, టీడీపీ నాయకులు ఇంత మల్లారెడ్డి, కోదూరు కమలాకర్ రెడ్డి, వేగూరు సర్పంచ్ అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వం

- కూటమి ఏడాది పాలనపై ప్రజల్లో సంతోషం
- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్



రామచంద్రపురం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రజలు మెచ్చే విధంగా రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి సుభాష్ మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ఫీ.మల్కొసుపాలెం, ఉండూరు గ్రామాలలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజ అభిప్రాయాలు తెలుసుకొని మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేస్తూ సమీపంలో ఉన్న అంగన్వాడి సెంటర్‌కు వెళ్లి అక్కడ పిల్లలకు అందిస్తున్న చదువు, సౌకర్యాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధిని కూడా పరుగులు తీయిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లను ఒకేసారి రూ. 1000 పెంచాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటూ అంతమందికీ ఒక్కొక్కరికి 13 వేల రూపాయల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేశాం. త్వరలో మహిళలకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ వెంట మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు పెంకె సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, సీనియర్ నాయకులు చింతపల్లి వీరభద్రరావు, అమలాపురం పార్లమెంట్ కన్వీనర్ ప్రకాష్, ఆయా గ్రామాల అధ్యక్ష,కార్యదర్శులు, బూత్,క్లస్టర్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

### చేనేత సహకార సంఘాల ఎన్నికలకు

# త్వరలో నోటిఫికేషన్

- చేనేతలకు వర్క్‌షెడ్లతో పాటు సోలార్ లైటింగ్ యూనిట్లు
- బీసీ హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ
- ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ద్వారా స్వయం ఉపాధి యూనిట్లు
- ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ యువతకు ఉపాధి
- అధికారులతో సమావేశంలో మంత్రి సవిత



అనకాపల్లి (చైతన్యరథం): రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత వెల్లడించారు. మంగళవారం అనకాపల్లి పట్టణంలో నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో వచ్చిన మంత్రి సవితను బీసీ వెల్ఫేర్, బీసీ కార్పొరేషన్, చేనేత, జౌళి శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం మంత్రి సవిత డిపార్ట్‌మెంట్ల వారీగా అధికారులతో మాట్లాడారు. చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని తెలిపారు. ఆప్కో, లేపాక్షి షోరూమ్‌ల ద్వారా అమ్మకాలు పెంచాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అర్హులైన నేతన్నలకు వర్క్ షెడ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వర్క్ షెడ్లలో సోలార్ లైటింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు.

**హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడండి**

వర్షాకాలం నేపథ్యంలో బీసీ హాస్టల్ విద్యార్థుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు. వేడి తాజా ఆహారం అందించాలన్నారు.హాస్టళ్ల అభివృద్ధికి సీఎస్ఆర్, డీఎమ్మార్ ఫండ్స్ సేకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీలను కలిసి ఎంపీ ల్యాండ్స్ నుంచి నిధుల సమీకరించాలన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఫలితాల శాతం పెంపుదలకు ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు.

**యువత ఉపాధికి యూనిట్లు నెలకొల్పండి**

ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా యువతకు ఉపాధి కల్పనకు సబ్సిడీ రుణాలతో కూడిన యూనిట్లు నెలకొల్పాలని మంత్రి సవిత ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా ఏర్పాటు చేసే స్వయం ఉపాధి యూనిట్ల గురించి స్థానిక ఎమ్మెల్యేలకు తెలియజేయాలన్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ అవకాశాలను అత్యధిక మంది యువతకు వినియోగించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి శ్రీదేవి, ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ఏడీ పద్మ, లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో మేనేజర్ రమణమూర్తి, ఎంఎస్‌ఈ స్కూల్ కన్వీనర్ వెంకటేశ్వర్లు, బీసీ కార్పొరేషన్ ఎండీ పెంటోజీరావు, చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి ఆర్వీ మురళీకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణానికి కమిటీ

- ఒంటిమిట్ట రామాలయంలో పూర్తిస్థాయి అన్నప్రసాద వితరణ
- రూ. 4.35 కోట్లు కేటాయింపు
- 142 కాంట్రాక్ట్ డ్రైవర్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి సిఫారసు
- టీటీడీ బోర్డు సమావేశం నిర్ణయాలు



తిరుమల (చైతన్యరథం): ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో పూర్తిస్థాయి అన్నప్రసాద వితరణకు రూ. 4.35 కోట్లు కేటాయిస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అదే విధంగా తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఈవో జె.శ్యామలరావుతో కలిసి మీడియా సమావేశంలో ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు. ఒంటిమిట్ట రామాలయంలో ఆగస్ట్ నుండి మూడు పూటలా అన్న ప్రసాద వితరణ చేస్తామన్నారు. తిరుమలలో రోజురోజుకు పెరుగుతున్న శ్రీవారి భక్తుల రద్దీకి అనుగుణంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయించామన్నారు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో అన్ని వసతులతో విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశాలను అధ్యయనం చేస్తామన్నారు. తిరుమలలోని శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్, డీపీఆర్ రూపొందించాలని నిర్ణయించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు, వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి నిపుణుల కమిటీ నివేదిక సమర్పించింది. దీనిపై టీటీడీ తరఫున ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవారి భక్తులు సైబర్ మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. తిరుమలలో పరిపాలన సౌలభ్యం కోసం అన్ని విభాగాలు ఒకచోట కేంద్రీకృతమయ్యేలా నూతన పరిపాలన భవనం నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. పదకవితా పితామహుడు అన్నమయ్య జన్మించిన తాళ్లపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం నిపుణులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నిర్మించిన 320 ఆలయాలకు రూ.79.82 లక్షలతో మైక్ సెట్లను ఉచితంగా అందించాలని నిర్ణయించారు. రాష్ట్ర దేవాదాయశాఖ సూచనల మేరకు శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించే శ్రీవారి ఆలయాలు, భజన మందిరాలను మూడు కేటగిరీలుగా విభజించి నిధులు చెల్లిస్తామన్నారు. కేటగిరీని బట్టి రూ. 10 లక్షలు, రూ. 15 లక్షలు, రూ. 20 లక్షలుగా చెల్లించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏపీ హైకోర్టు తీర్పు మేరకు టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పని చేస్తున్న 142 మందిని క్రమబద్ధీకరించేందుకు సమావేశం ఆమోదం తెలిపింది. దీనిని ప్రభుత్వ ఆమోదానికి పంపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు మెంబర్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో శ్రీ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

# భారీ నకిలీ మద్యం రాకెట్ భగ్నం

- అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు
- పటిష్ట నిఘాతో పకడ్బందీగా దాడులు
- ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ భారీ విజయం
- 36 మంది అరెస్టు, 2200 లీటర్లకు పైగా అక్రమ స్పిరిట్ స్వాధీనం



అమరావతి (చైతన్యరథం): నకిలీ మద్యం వ్యాప్తిని అడ్డుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక దాడుల్లో భారీ విజయం నమోదయింది. ఆధునీకరించిన నిఘా వ్యవస్థ, డేటా విశ్లేషణ ఆధారంగా చేపట్టిన చర్యల్లో 36 మందిని అరెస్టు చేయడంతో పాటు 2,232 లీటర్లకు పైగా అక్రమ స్పిరిట్, నకిలీ మద్యం బాటిళ్లు, లేబుళ్లు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రధానంగా ప్రజారోగ్యం, నాణ్యమైన మద్యం సరఫరాపై దృష్టి సారించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు నకిలీ మద్యం నిర్మూలనపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ మీనా ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెట్టి దాడులు చేపట్టారు.

నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు డేటా ఆధారంగా స్పిరిట్ వినియోగంలో అనుమానాస్పద మార్పులను గుర్తించి ప్రత్యేక దాడులు నిర్వహించారు. జూన్ నెల 23 తేదీ నుంచి జూలై 22 వ తేదీ వరకు కోరింగిపాలెం, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో ఈ దాడులు జరిగాయి. నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే ఖాళీ బాటిళ్లు, సీలింగ్ యంత్రాలు, లేబుళ్లు, మిషన్లు స్వాధీనం చేసుకున్నారు.

**కృష్ణ ఫార్మా ప్రధాన కేంద్రంగా..**

తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ జిల్లాలో ఉన్న కృష్ణ ఫార్మా కంపెనీ ఈ ముఠాకు మూలంగా గుర్తించబడింది. కరోనా మహమ్మారి సమయంలో తాత్కాలికంగా మంజూరైన అనుమతిని దుర్వినియోగం చేస్తూ, స్పిరిట్‌ను హ్యాండ్‌రబ్ పేరుతో డెనేచర్ చేయకుండా నేరుగా నకిలీ మద్యం తయారీదారులకు పంపినట్లు విచారణలో తేలింది. కంపెనీ యజమాని మల్లికార్జునరావు నేరాన్ని ఒప్పుకున్నారు. రుత్తల శ్రీనివాస్ అలియాస్ అబ్దుల్ కలాం, చరణ్జీత్ సింగ్ సేఠీలకు స్పిరిట్ సరఫరా చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.

**ఇతర రాష్ట్రాల్లోనూ దాడులు**

ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ఇచ్చిన సమాచారంతో తెలంగాణ ఎక్సైజ్ అధికారులు స్పందించి, సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో ఈ నెల 21 వ తేదీన ఎనిమిది వందల లీటర్ల స్పిరిట్, నకిలీ లేబుళ్లు, ఖాళీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ముంబయిలోని సరఫరాదారుల నుంచి తెచ్చిన ఖాళీ బాటిళ్లు, బ్రాండ్ లేబుళ్లు కూడా నిందితుల వద్ద లభించాయి.

**ప్రజారోగ్యం పరిరక్షణకు చర్యలు**

డెనేచర్ చేయని స్పిరిట్‌ను నేరుగా మద్యం తయారీలో వాడటంవల్ల ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కమిషనర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, నిఘా వ్యవస్థను ఆధునీకరించి, డేటా ఆధారంగా చర్యలు చేపట్టడం వల్లే ఈ ముఠా గుట్టు ఛేదించగలిగామని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ, ప్రతి నేరంలో భాగమైన వ్యక్తిని గుర్తించి శిక్షించడానికి శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందన్నారు. నిఘా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో ఇటువంటి ముఠాలకు రాష్ట్రంలో తావు ఉండదని స్పష్టం చేశారు.

**తదుపరి చర్యలు**

కృష్ణ ఫార్మా కంపెనీ లైసెన్సు రద్దు చేయాలని తెలంగాణ అధికారులను ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ కోరనుంది. అంతర్రాష్ట్ర సమన్వయంతో మిగిలిన నిందితులను గుర్తించి శిక్షించే ప్రక్రియ కొనసాగుతుంది. నకిలీ మద్యం వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ ఆపరేషన్‌తో ప్రజలకు నాణ్యమైన మద్యం అందే మార్గం సుగమం అయింది. నిబంధనలు పాటించే మద్యం వ్యాపారానికి భరోసా పెరిగింది. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలను మరింత వేగవంతం చేసింది.

### విజయవాడ సెంట్రల్‌లో
# సుపరిపాలనలో తొలిఅడుగు



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పిలుపు, విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. 62 వ డివిజన్ లోని బూత్ నెంబర్ 95లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను స్థానికులకు వివరించారు. కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమాన్ని తెలియచెబుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం పరిశీలకులు దేవతోటి నాగరాజు, డివిజన్ ఇంచార్జ్ పైడి శ్రీను, 62, 63 డివిజన్స్ క్లస్టర్ ఇన్‌ఛార్జి బత్తుల కొండ, కో క్లస్టర్ తొట్టెంపూడి ఉదయ్ శంకర్, డివిజన్ అధ్యక్షుడు జలకం రాజారావు, సెంట్రల్ తెలుగు యువత అధ్యక్షుడు బెజ్జం జయపాల్, ఇన్‌ఛార్జి పీసా సూరిబాబు, కేఎస్ఎస్ సభ్యులు చిన్నారావు, లంకలపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

# మద్యం కేసు
## నిందితుల రిమాండ్ పొడిగింపు

విజయవాడ (చైతన్యరథం): ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు పొడిగించింది. ఆగస్టు 1 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో 11 మంది నిందితులకు రిమాండ్ ముగియడంతో సిట్ అధికారులు మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. నిందితులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి సహా 11 మందికి రిమాండ్‌ను పొడిగించింది.

# దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసు..
### తదుపరి విచారణకు కోర్టు అనుమతి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్, దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యకేసులో తదుపరి విచారణకు రాజమహేంద్రవరంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు అనుమతి ఇచ్చింది. 90 రోజుల్లో సప్లిమెంటరీ ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు సమగ్ర దర్యాప్తునకు అనుమతి కోరుతూ ఇటీవల ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టును కోరగా.. న్యాయస్థానం మంగళవారం ఈ మేరకు అనుమతి ఇచ్చింది.

2022 మే 19న కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగింది. డ్రైవర్‌ను హతమార్చిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు.. మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఘటన సంచలనం రేపిన సంగతి తెలిసిందే. హత్య తానే చేశానని అనంతబాబు అంగీకరించినట్లు మీడియా సమావేశంలో అప్పటి ఎస్పీ రవీంద్రనాథబాబు వెల్లడించారు. అనంతబాబును రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు పంపారు. తర్వాత మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారు.

ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు అప్పట్లో వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. నేరారోపణ ఎదుర్కొంటున్న అనంతబాబును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలనీ, పార్టీ నుంచి బహిష్కరించాలనీ పౌర సంఘాలు, దళిత సంఘాల నుండి డిమాండ్లు వచ్చాయి. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని డైల్యూట్ చేయడానికి ప్రయత్నించింది. చివరకు తూతూ మంత్రంగా పార్టీ నుంచి సస్పెండ్ చేసినా.. నాలుగైదు నెలలకే ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. గత ఎన్నికల సమయంలో పార్టీ తరఫున ప్రచారం కూడా చేశారు.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. తమకు న్యాయం చేయాలని, ఈ హత్య కేసుపై సమగ్రంగా విచారణ జరిపి, అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది. బాధిత కుటుంబానికి పరిహారం అందజేయడంతో పాటు న్యాయ సలహాలకు ప్రత్యేక న్యాయవాదిగా ముప్పాళ్ల సుబ్బారావును కూటమి ప్రభుత్వం నియమించింది.

# రైతుల భూములపై దోపిడీ కుట్ర

## అందుకే జగన్ ఫొటో వేయించారు: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పాణ్యం (చైతన్యరథం): గత ప్రభుత్వంలో రైతుల పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో వేయించుకుని కోట్ల ఎకరాల రైతుల భూములను ప్రభుత్వ భూమి పేరుతో రుణం తీసుకోవాలని వైసీపీ కుట్ర చేసిందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొ న్నా రు. నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం దుర్వేసిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వైసీపీ నేతలు అవహేళన చేసినా ప్రజలు విశ్వసించి గెలిపించారన్నారు. దుర్వేసి గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామంలో సుంకులమ్మ గుడి నిర్మిస్తామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నాం. ఆడబిడ్డ నిధిని కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఆడబిడ్డలకు పెళ్లి, ఉద్యోగం వచ్చే వరకు ఆ నిధి అండగా ఉంటుందని వివరించారు. చెప్పిన మాట చేసి చూపించే వ్యక్తి చంద్రబాబు. అలయాల్లో ధూపదీప నైవేద్యాలకు పూజారికి ప్రతినెలా రూ.10 వేలు ఇవ్వనున్నామని తెలిపారు. జిల్లాలో 47 అలయాలకు రూ.43 కోట్లు కేటాయించామని వివరిం చారు. కాల్వ బుగ్గకు నాలుగు కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు.



## స్కాముల వైసీపీ చేసేవన్నీ దుష్ప్రచారాలే

- ప్రజలు ఛీకొడుతున్నా తీరు మార్చుకోరు
- అభివృద్ధికి కేరాఫ్ కూటమి ప్రభుత్వం
- విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అద్దంకి (చైతన్యరథం): కుంభకోణాల వైసీపీ చేసేవన్నీ దుష్ప్రచారాలేనని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుపరి పాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశంలో భాగంగా మంగళవారం అద్దంకి నియోజకవర్గంలో పర్య టించారు. రూ.5.10 కోట్లతో నిర్మించనున్న వెంపరాల - మైలవరం బీటీ రోడ్డుతో పాటు రూ.55 లక్షల జల్ జీవన్ మిషన్‌కు ముందుగా మంత్రి శంకుస్థాపన చేశారు. వెంపరాల-మైలవరం తారు రోడ్డును ఐదు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకు వస్తానని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్, నాబార్డ్, ఆర్ అండ్ బీ నిధులతో ఈ రోడ్లను నిర్మించామని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కిలోమీటర్ రోడ్డును కూడా వేయలే దని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రోడ్ల నిర్మాణ పనులను చేపట్టామని పేర్కొన్నారు.అద్దంకి నియోజకవర్గ పరిధిలో రూ.110 కోట్లతో రహదారులు నిర్మించినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని వివరించారు. వైసీపీ నాయకులు లిక్కర్ స్కామ్‌తో పాటు అన్ని రకాల స్కాముల్లో ఇరుక్కుని కొట్టుమిట్టాడుతున్నారు. దొంగ కార్యక్రమాలు పెట్టి ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిప డ్డారు. దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించిందన్నా రు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లకు ఎంపికలు

### ప్రారంభించిన శాప్‌చైర్మన్ రవినాయుడు



గుంటూరు (చైతన్యరథం): కడప స్పోర్ట్స్ స్కూల్‌లో 4,5 తరగతుల అడ్మిషన్ల భర్తీకి సంబంధించి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపికలను శాప్ చైర్మన్ రవినాయుడు మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపికల ప్రక్రియను శాప్ డైరెక్టర్లు ఏ.రమణారావు, పి.రవీంద్రనాథ్, శాప్ ఏవో వెంకటరమణ నాయక్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పాల్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శాప్‌చైర్మన్ మాట్లాడుతూ పారదర్శకంగా, సమర్థవంతంగా ఎంపికల ప్రక్రియ చేపడుతున్నామన్నారు. శారీరక, మానసిక దారుఢ్యంతో పాటు క్రీడాకారులుగా రాణించాలనుకునే వారిని ఎంపిక చేయడమే అజెండా అన్నారు. ప్రతిభతో పాటు అర్హత కలిగిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సిఫారసులు, ప్రోద్బలాలకు అతీతంగా విద్యార్థుల ఎంపిక జరుగుతోందని తెలిపారు.

***వాలీబాల్ క్రీడాకారుడికి అభినందన***

అమరావతి(చైతన్యరథం): థాయ్‌లాండ్‌లో ఈనెల 12 నుంచి 19 వరకు జరిగిన 2వ ఏషియన్ అండర్-16 మెన్ వాలీబాల్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన యువకుడు అట్టాడ చరణ్ భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా శాప్‌చైర్మన్ అభినందించారు. భారత జట్టులో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించిన సిక్కోలు క్రీడాతేజం చరణ్ ప్రదర్శన, ప్రతిభ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సహజ ప్రసవాలకు ప్రత్యేక పథకం

- 86 ఆసుపత్రుల్లో ప్రారంభానికి సన్నాహాలు
- ప్రసూతి సేవలకు 1264 మంది సహాయకులు
- సిజేరియన్‌ల తగ్గింపునకు చర్యలు
- వైద్య మంత్రి సత్యకుమార్ ఆమోదం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ దిశగా సుశిక్షితులైన మిడ్‌వైవ్స్ (ప్రసూతి సహాయకులు) ద్వారా సహజ ప్రసవా లను ప్రోత్సహించే పథకానికి వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ప్రసవ సమయాల్లో ప్రభుత్వాసుపత్రుల్లోని స్టాఫ్ నర్సులే ప్రసూతి సేవలు అందిస్తున్నారు. వీరికి వివిధ అంశాలపై తగిన పరిజ్ఞానం, శిక్షణ కొరవడ డంతో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ లోటును తీర్చేందుకు ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు 18 నెలల పాటు ప్రసవానికి ముందు, ప్రసవ సమయం, ప్రస వానంతర సేవలకు సంబంధించిన అంశాలపై సమగ్ర శిక్షణ అందించి మహిళలు సహజ ప్రసవాలపై మొగ్గు చూపేలా ప్రత్యేక పథకాన్ని రూపొందించారు. తొలి విడతలో సంవత్సరానికి 600 నుంచి 6000 పైగా ప్రసవాలు జరుగుతున్న 86 ప్రభుత్వాసుపత్రుల్లో సుశిక్షితు లైన 1264 మంది ప్రసూతి సహాయకులు (మిడ్‌వైవ్స్) నియమిస్తారు. వీరు వివిధ సమయాల్లో అందించాల్సిన సేవలు, విధులపై సమగ్ర జాబ్ చార్టును రూపొందించి ప్రసూతి సేవల నాణ్యతను ఈ పథకం కింద పెంచుతారు. అవుట్ పేషెంట్(ఓపీ) సర్వీసుల్లో భాగంగా గర్భవతుల పూర్వ ఆరోగ్య వివరాలు, ప్రస్తుత స్థితి, ప్రసవ విషయ పరిజ్ఞానం, సరైన పోషణ, వ్యాయామ అవసరాలు, సహజ ప్రసవాల వల్ల కలిగే లాభాలను శిక్షణ పొందిన మిడ్‌వైవ్స్ అందిస్తారు. లేబర్ రూముల్లో ప్రసవ నొప్పులకు సంబంధించిన విషయ పరిజ్ఞానం, వాటిని భరించే విధానం, సహజ ప్రసవానికి అవసరమైన సలహాలు, ఏవైనా క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యే అవకాశాల గుర్తింపు, చేపట్టాల్సిన చర్యలపై వీరు తగు సలహాలిస్తూ అప్రమత్తంగా ఉంటారు. ప్రసవానంతరం తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితి అంచనా, తల్లిపాల విశిష్టతను వివరించడంతో పాటు వారి మానసిక అనుబంధాన్ని పెంచడం, ప్రసవానంతరం ఎదురయ్యే సమస్యలపై దృష్టి పెడతారు. ప్రస్తుత స్టాఫ్ నర్సుల విషయ పరి జ్ఞానం, శిక్షణారాహిత్యాల వలన ప్రసవ సమయాల్లో డాక్టర్ల పాత్ర ఎక్కువగా ఉండడంతో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతు న్నాయని ఒక అంచనా. కేంద్ర ప్రభుత్వ సాయంతో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద అమలయ్యే ఈ పథకానికి సంబంధించిన పలు అంశాలను లోతుగా చర్చించి మంత్రి ఆమో దం తెలిపారు. ఈ పథకం విస్తృతిని పెంచాలని, గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవాలు నిర్వహించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి కేంద్రంలోనూ ఒక సుశిక్షిత ప్రసూతి సహాయకురాలు (మిడ్‌వైఫ్) ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన ప్రతి స్టాఫ్‌నర్సుకు 18 నెలల పాటు సమగ్రమైన శిక్షణ అందించడానికి స్టైఫండ్‌తో కలిపి రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరం లో రాష్ట్రంలో మొత్తం ప్రసవాల్లో 56.12శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగినట్లు సమాచారం. ఇందులో ప్రభుత్వాసు పత్రుల్లో జరిగిన ప్రసవాల్లో 41.40 శాతం సిజేరియన్లు కాగా ప్రైవేట్ ఆసు పత్రుల్లో 67.71 శాతం మేరకు సిజేరియన్ ప్రసవాలు జరిగాయి.

## బతుకుదెరువుకు వలస వెళితే భూ కబ్జా

### వైసీపీ నేతలతో వీఆర్వో, సర్వేయర్ దందాలు - సచివాలయ ఉద్యోగి అయిన భర్త వేధిస్తున్నాడు - ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదులు





మంగళగిరి (చైతన్యరథం): బతుకుదెరువు కోసం ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం చాట్లమడ గ్రామం నుంచి గుంటూ రుకు వలస వచ్చాం.. గ్రామంలో తండ్రి పేరున ఉన్న పొలాన్ని కొంత మంది ఆక్రమించుకున్నారు. వారి నుంచి తమ పొలాన్ని విడిపించాలని గుంటూరుకు చెందిన చీదళ్ల వెంకటనారాయణ వేడుకున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజా వినతుల్లో ఆ మేరకు ఫిర్యాదు చేశారు. శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ డాక్టర్ శివ ప్రసాద్ అర్జీలు స్వీకరించారు.

వీఆర్వో, సర్వేయర్‌లు ఇద్దరూ భూ కబ్జాదారు చంద్రశే ఖర్‌రెడ్డితో కుమ్మక్కై తన భూమికి దొంగ పత్రాలు సృష్టించి భూమి ని ఆక్రమించారని నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం ఉనుకు ర్తి గ్రామానికి చెందిన అక్కెం శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు చేశారు.

వైసీపీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, వీఆర్వో, సర్వేయర్ కుమ్మక్కై తన పొలాన్ని అక్రమంగా వియజ్‌కుమార్‌రెడ్డి పేరుపైకి మార్చారని నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం ముదిగేడు గ్రామానికి చెందిన వాసురెడ్డి ఫిర్యాదు చేశారు. వీరిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తమ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.. వారానికి ఒకసారి నీరు వస్తుంది. సమస్యను పరిష్కరించాలని కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన పలువురు గ్రామస్తులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

టీచర్‌గా పనిచేస్తున్న జనార్దన్ అనే వ్యక్తి తనతో సహజీవనం చేస్తూ తన నగలు, డబ్బులు తీసుకోవడమే కాకుండా చంపుతానని బెదిరిస్తున్నాడని నంద్యాలకు చెందిన ఓ బాధితురాలు ఫిర్యాదు చేసింది.

సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న తన భర్త మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై తనను చిత్రహింసలు పెడుతున్నాడని అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఓ వివాహిత ఆవేదన వ్యక్తం చేసింది.

# ప్రతి ఇంటికి సూపర్ సిక్స్ : శిరీషదేవి



రంపచోడవరం (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యురాలు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కూటమి పార్టీల శ్రేణులతో కలిసి మధ్యాహ్నం 3 గంటలకు జడ్డంగిలోని వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రక్కన నూతనంగా నిర్మించిన 'బహుళ ప్రయోజన సౌకర్య గోదాం (సొసైటీ వారిచే నిర్మించబడిన గోడౌన్ )ప్రారంబించారు. ఫెర్టిలైజర్ అమ్మకాలు ప్రారంబించారు. అదేవిధంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సుపరిపాలన తొలిఅడుగు సంబంధించిన కరపత్రాలతో డోర్ టూ డోర్ తిరిగి పథకాలపై ప్రజలకు అందుతున్న తీరును అడిగి తెలుసుకొని గడిచిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇది "సుపరిపాలనతో కూటమి ప్రభుత్వం సూపర్ పాలన కూడా అని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంటిలోకి వెళ్లి గడప గడపకూ చంద్రబాబునాయుడు సంకల్పాన్ని ప్రజలకు చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావ్, ముప్పన కేశవ, వాసంశెట్టి గంగాధర్, కాళ్లకూరి సత్యసుందరరావు, కంఠపురెడ్డి వీరబాబు, చెక్కా పండుబాబు, గట్టి మాణిక్యం,చవలా కుమార్ బాబు, ముప్పన మోహన్, రేలంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరీ



కురుపాం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు కురుపాం నియోజకవర్గం, కురుపాం మండలం, గుమ్మ, ఏగులవాడ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. టీడీపీ శ్రేణులు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేని ఘనంగా స్వాగతం పలికారు. కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించడం జరిగింది. రానున్న రోజుల్లో మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ కద్రక కళావతి, మండల కన్వీనర్ కొండయ్య, నియెజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నాయకులు సుకేష్ పండా, స్థానిక సర్పంచ్, బూత్ ఇన్చార్జిలు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కూటమి పాలనలో సంతోషంగా ప్రజలు



అనకాపల్లి (చైతన్యరథం): నియోజవర్గంలోని అనకాపల్లిలోని 84వ వార్డు నెయ్యల వీధిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 84వ వార్డు నెయ్యల వీధి పరిసర ప్రాంతాల్లో ఇంటింట ప్రచారాన్ని మాజీ శాసన మండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు స్థానిక పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వ పనితీరు ఏ విధంగా ఉందని ప్రజల నుండి సమాధాన్ని రాబట్టారు. కూటమి ప్రభుత్వం అందర్నీ బాగా చూస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని, ఓర్వలేని వారు తప్పుడు ప్రచారాలు చేస్తున్న నమ్మే పరిస్థితి లేదని చెప్తూ విశ్వసనీయతకు మారుపేరు చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని నాగ జగదీష్ అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు పెన్షన్, మెగా డీఎస్సీ, ఉచిత గ్యాస్ సిలిండర్, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇప్పటికే అమలు అవుతున్నాయని ప్రజల నుండి స్పందన వస్తుందని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో రేపాక ఈశ్వర అప్పారావు, శ్రీకాకుళం గణపతి రేపాక లోవరాజు, చింతపల్లి నరసింహమూర్తి, బోడి వెంకట్రావు, పిల్ల తారకేష్, బత్తుల శ్రీనివాసరావు, కాండ్రేగుల జగదీష్, మల్ల గణేష్, పెంటకోట శివరాం, బర్నికాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనపై ప్రజల్లో సంతోషం



రేణిగుంటలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అనగాని



కొవ్వూరు నియోజకవర్గంలో ముప్పిడి వెంకటేశ్వరరావు పర్యటన



మ ంగళగిరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



పమిడి ముక్కల మండలం మంటాడ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే వర్ల



అనకాపల్లి రజక కాలనీలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత



గిద్దలూరులో ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే ముత్తుమల



కనిగిరి నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



చీరాలలో ప్రచారం చేపడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య



జమ్మలమడుగులో ఇంటింటి ప్రచారం చేపడుతున్న భూపేష్ సుబ్బారామిరెడ్డి



విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పెడన నియోజకవర్గంలో పర్యటిస్తున్న మంత్రి పి. నారాయణ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



పులివెందులలో ఇంటింటి ప్రచారం చేపడుతున్న బీటెక్ రవి



తూర్పునాయుపాలెంలోని కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి బాల వీరంనేయస్వామీ



రణస్థలంలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్



ఉయ్యూరు మండలం సాయిపురం, జబర్లపూడిలో పర్యటించిన టీడీపీ శ్రేణులు



నందిగామలో ప్రచారం చేపడుతున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ముక్కా రూపానందరెడ్డి

# పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

**●హైస్కూలు స్థాయికి నేషనల్ సీనియర్ బేసిక్ స్కూలు**

**●ఐడిబిఐ సీఎస్సార్ నిధులు రూ.1.75 లక్షలతో కంప్యూటర్... టేబుళ్ళు... బెంచీలు... ఫ్యాన్లు అందచేత**

**●నా హయాంలో హైస్కూలుగా మారడం అదృష్టంగా భావిస్తున్నా : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమండ్రి సిటీలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) కొనియాడారు. హైస్కూలు స్థాయికి చేరిన నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్ కు ఐడిబిఐ బ్యాంక్ సిఎస్ఆర్ నిధులు రూ.1.75 లక్షలతో సమకూర్చిన కంప్యూటర్... టేబుళ్ళు... బెంచీలు... ఫ్యాన్లు ఐడిబిఐ జీఎం, రీజనల్ హెడ్ కె దాస్, టీడీపీ నాయకులతో కలిసి పాఠశాల యాజమాన్యానికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ... ఇప్పటివరకు ఎలిమెంటరీ స్కూలుగా ఉన్న ఈ స్కూలు నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ హైస్కూలుగా మారిందని, పదోతరగతి వరకు విద్యార్థులు చదివే అవకాశం కలిగిందని, అది తన చేతుల మీదుగా ప్రారంభం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. హైస్కూలు స్థాయికి చేరిన ఈ స్కూలులో ప్రభుత్వపరంగా కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని, అయితే ఈలోగా 8వ వార్డులోని తన మిత్రులు టీడీపీ సీనియర్ నాయకుడు ఐడిబిఐ సహకారం తీసుకుందామని చెప్పడంతో స్థానిక బ్రాంచి మేనేజర్ అనిల్, రీజనల్ హెడ్, జనరల్ మేనేజర్ దాసుతో మాట్లాడంతో జనరల్ మేనేజర్ దాసు రూ.1.75 లక్షల సీఎస్సార్ నిధులు మంజూరు చేసి కంప్యూటర్, యూ.పి.ఎస్, ప్రింటరు, తరగతి గదిలో టేబుళ్ళు, బెంచీలు, సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. తాను ఎమ్మెల్యే అయిన ఈ ఏడాదిలో నగరంలోని మూడు ఎలిమెంటరీ స్కూళ్ళు హైస్కూల్ స్థాయికి మారాయని ఆయన చెప్పారు. వి.ఎల్.పురం శ్యామలాంబ హైస్కూలు, మోరంపూడి స్కూలులో కూడా కొన్ని మౌలిక సదుపాయాలు అలసరమని ఇప్పటికే ఒక స్కూలు లో తన మిత్రులు రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం

అమరావతి (చైతన్యరథం): ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు కానుంది. దీని అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు తాజాగా కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం ప్రజలకు లబ్ధి ఎలా కలిగిస్తుందో స్పష్టంగా తెలిపేందుకు 'జీరో ఫేర్ టిక్కెట్' విధానాన్ని తీసుకురావాలని సీఎం సూచించారు. ఈ టిక్కెట్‌లో ప్రయాణికురాలు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లింది, టిక్కెట్ ధర ఎంత, అందులో ప్రభుత్వం ఎంత మేర రాయితీ ఇచ్చింది వంటి సమాచారం స్పష్టంగా ఉండాలన్నారు. ఇలా చేస్తే లబ్ధిదారులకు ప్రభుత్వ మద్దతు ఏ స్థాయిలో ఉందో ప్రత్యక్షంగా తెలుస్తుందని సీఎం పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాలలో అధ్యయనం – పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్న సీఎం సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతోన్న ఈ పథకం వల్ల ఆయా ప్రభుత్వాలపై ఎంత వ్యయం పడుతోంది?, మన రాష్ట్రానికి ఇది ఎంత భారంగా మారే అవకాశం ఉందో? సీఎం సమీక్షించారు. ఏ పరిస్థితుల్లోనూ పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేయాలని స్పష్టం చేస్తూ, ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇది మహిళల ఆర్థిక, సామాజిక స్వావలంబనకు దోహదపడే చారిత్రాత్మక పథకంగా సీఎం పేర్కొన్నారు. 'ఆర్టీసీకి భారం కాకుండా లాభాల బాటలోకి నడిపించాలి' మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఆర్థిక భారం పడకుండా చూసేందుకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు, నిర్వహణ వ్యయం తగ్గింపు, విభిన్న వ్యూహాల రూపకల్పన అవసరమని సీఎం పేర్కొన్నారు. సంస్థను లాభాల బాటలోకి తీసుకెళ్లే విధానంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.

# రైల్వే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోండి

**●రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి**



ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, అమృత భారత స్టేషన్ 2.0 పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నీతి ఆయోగ్ మంజూరు చేసిన నిధులను రైల్వే శాఖ ద్వారా త్వరితగతిన విడుదల చేయించాలని రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్‌కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్‌ను రైల్ భవన్‌లోని ఆయన కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం కలిశారు. ఈ సందర్బంగా రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించారు. అనంతరం విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్‌తో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రస్తావించారు. విజయవాడ రైల్వే డివిజన్‌లో పెండింగ్‌లో వున్న లెవెల్ క్రాసింగ్ నెం. 316 (విజయవాడ – గుణదల), లెవెల్ క్రాసింగ్ నెం. 147 (రాయనపాడు – కొండపల్లి), లెవెల్ క్రాసింగ్ నెం. 148 (విజయవాడ – రాయనపాడు), లెవెల్ క్రాసింగ్ నెం.8 (విజయవాడ – రామవరప్పాడు), వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌లు, రోడ్ అండర్ బ్రిడ్జ్‌లు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే అమృత భారత స్టేషన్ 2.0 పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నీతి ఆయోగ్ మంజూరు చేసిన రూ.836.47 కోట్ల నిధులను రైల్వేశాఖ తొందరగా విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన విజ్ఞప్తులపై రైల్వే బోర్డ్ చైర్మన్ సతీష్ కుమార్ సానుకూలంగా స్పందించటమే కాకుండా సంబంధింత అధికారులకు ఆదేశాలు ఇవ్వటం జరిగింది.

# వర్జీనియాలో "తెలుగు ఆడపడుచుల గోరింటాకు పండుగ"

**●తానా ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా నిర్వహణ**

**●అమెరికాలో తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టిన కార్యక్రమాలు**



వర్జీనియా/అమరావతి (చైతన్యరథం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమెరికాలోని వర్జీనియాలో తానా ఆధ్వర్యంలో "ఆడపడుచుల గోరింటాకు పండుగ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తానా సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ సాయిసుధా పాలడుగు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, ఈనాడు ఎడిటర్ డీఎన్ ప్రసాద్, గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో స్థానిక తెలుగు మహిళలు పాల్గొన్నారు. అందరూ గోరింటాకు పెట్టుకున్నారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి. ఏ దేశంలో ఉన్నా మన సంస్కృతి, సంప్రదాయాల్ని కాపాడుకోవడంలో తెలుగు మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తారని సాయిసుధా పాలడుగు అన్నారు.

అమెరికాలో తెలుగువారి జీవన విధానం, సంస్కారాలు, పండుగల్ని భావితరాలకు తెలియజేయడం కోసం... భాష కట్టుబొట్టుల్ని కాపాడడం కోసం తానా ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆమె వెల్లడించారు.

**నరేన్ కొడాలి మాట్లాడుతూ...**" అయిదు దశాబ్దాల తానా సుదీర్ఘ ప్రయాణంలో అనేక ఎత్తుపల్లాలు, మరెన్నో ఆటుపోట్లు తట్టుకుని సగర్వంగా నిలబడి తన ఉనికిని చాటుకుంది. భవిష్యత్తులో 50 వసంతాలకు చేరుకోనున్న సందర్భంగా "న భూతో న భవిష్యతి" అన్న రీతిలో తెలుగు వారికి కీర్తి దశదిశలా వ్యాప్తి చేసేలా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రవాసాంధ్రులు వీటిలో భాగస్వాములై విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.

**మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ....** అమెరికాలోని తెలుగుదనాన్ని ఒక వేదిక మీదకు తీసుకువచ్చి అమ్మ భాషకు, తెలుగుజాతికి గుర్తింపు, గౌరవాన్ని 'తానా' తీసుకొచ్చిందని కొనియాడారు. ఒక జాతి అస్థిత్వాన్ని, ప్రత్యేకతను చాటిచెప్పేది మాతృభాషేనని తెలిపారు. "మాతృభాషను విస్మరించిన ఏ జాతి మనగుడ సాగించలేదు. అనేక జాతులు మాతృభాషను విస్మరించి కాలగర్భంలో కలిసిపోయాయి. ఇది చరిత్ర చెప్పే సత్యం. భాష సాంస్కృతిక వారథి. అందుకే మాతృభాష మృతభాష కాకూదని ఇక్కడి ప్రవాసాంధ్రులు చేస్తున్న కృషి అభినందనీయం" అని మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుధీర్ కొమ్మి, జానీ నిమ్మలపూడి, రాజేష్ కాసరనేని, అనిత మన్నవ, శ్రీవిద్య సోమ, అనీల్ ఉప్పలపాటి, రవి అడుసుమిల్లి, భాను మాగులూరి, శాంతి పారుపల్లి, కవిత చల్లా, త్రిలోక్ కంతేటి, సాయి బొల్లినేని, సత్య సూరపునేని, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ సహకారంతో 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

**●స్త్రీ శక్తి సంక్షేమం పేరుతో మహిళలకు ఉచితంగా శిక్షణ, కుట్టు మిషన్లు అందిస్తున్న మంత్రి నారా లోకేష్**

**●శిక్షణ పొందిన "70"వ బ్యాచ్ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ**

**●కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేసిన నియోజకవర్గ తెలుగు మహిళలు**



మంగళగిరి (చైతన్యరథం): మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 70వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు అందజేశారు. మంత్రి నారా లోకేష్‌కు లబ్దిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి సాధించడం ద్వారా ఆ కుటుంబాలు ఆర్థికంగా నిలబడతాయన్న ఉద్దేశ్యంతో మంత్రి నారా లోకేష్ స్త్రీ శక్తిని నెలకొల్పి ఉచితంగా మహిళకు కుట్టుమిషన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. మంత్రి నారా లోకేష్ కృషితో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి నారా లోకేష్ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ హయాంలో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటే మంత్రి నారా లోకేష్ గెలిచిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, నియోజకవర్గం తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపుడి వైష్ణవి, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, మంగళగిరి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, మండల తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, శివాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై గోడౌన్‌లలో

# మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు

### ●బియ్యం నాణ్యత, ప్యాకింగ్, తూకం, పరిశుభ్రతపై మంత్రి పరిశీలన



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం విజయవాడలోని గొల్లపూడి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని సివిల్ సప్లై గోడౌన్‌ను, గన్నవరం సివిల్ సప్లై గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 41,091 పాఠశాలలు, 3,800 సంక్షేమ హాస్టళ్లకు మధ్యాహ్న భోజన పథకం కింద 25 కిలోల బస్తాల్లో బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు. ఈ పథకాన్ని మరింత మెరుగుపరచడానికి ప్రతి బస్తాపై క్యూఆర్ కోడ్ ముద్రించడం జరుగుతోందని, దీనికి చిన్నారుల, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోందని ఆయన అన్నారు. విజయవాడ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఇబ్రహీంపట్నం, విజయవాడ అర్బన్, విజయవాడ రూరల్ పరిధిలోని 378 చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరా అవుతోంది. గన్నవరం రైస్ గోడౌన్ నుంచి గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లోని 103 చౌక ధరల దుకాణాలకు సరఫరా జరుగుతోందన్నారు.

గోడౌన్‌లోని మధ్యాహ్న భోజనానికి అందించే బియ్యం బస్తాల ప్యాకింగ్‌లను పరిశీలించారు. బియ్యం బస్తాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తన ఫోన్ ద్వారా స్వయంగా స్కాన్ చేసి వివరాలు సరిగ్గా వస్తున్నాయో లేదో తనిఖీ చేశారు. బఫర్ గోడౌన్ నుంచి వచ్చిన స్టాక్‌ను దిగుమతి చేసుకున్న తర్వాత, మండల్ లెవెల్ స్టాక్ పాయింట్ నుంచి డీలర్లకు ఎగుమతి చేసేటప్పుడు ప్యాకింగ్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని హమాలీ కూలీలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం బస్తా ప్యాకింగ్, బియ్యం క్వాలిటీ, గోడౌన్ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇందులో ఎటువంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. తూకం, ఆయిల్ ప్యాకెట్లను కూడా ఆయన తనిఖీ చేశారు.

**స్టాక్ వ్యత్యాసాలు - డీలర్లపై చర్యలు**

గత మూడు నెలల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించగా, కొంత మంది డీలర్ల వద్ద క్లోజింగ్ అండ్ ఓపెనింగ్ స్టాక్‌లో గణనీయమైన వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో, విజయవాడ రైస్ గోడౌన్ నుంచి రైస్ తీసుకుంటున్న నాలుగు డీలర్ల స్టాక్ వెరిఫికేషన్‌లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఏలూరు రోడ్డులోని పోతినేని వారి వీధిలో ఉన్న ఒక చౌక ధరల దుకాణాన్ని మంత్రి తనిఖీ చేశారు. ఈ దుకాణం వద్ద డీలర్ లేకపోవడం, ఉండవలసిన స్టాక్ లేకపోవడం, దుకాణం బయట విధిగా ఏర్పాటు చేయవలసిన పోస్టర్ లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి చౌక ధరల దుకాణం వద్ద విధిగా స్టాక్, అధికారుల వివరాలు, అభిప్రాయం మరియు ఫిర్యాదులు చేయడానికి క్యూఆర్ కోడ్ స్కానర్‌తో కూడిన పోస్టర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# గుడివాడ ఆటోమొబైల్ రంగ ఖ్యాతిని మరింత పెంపొందిస్తాం

### ●ట్రాన్స్ పోర్ట్ వాహనదారుల ఏ.టి.ఎస్ సమస్య.. పరిష్కారానికి ఎమ్మెల్యే రాము కృషి

### ●వేలాది మంది వాహనదారుల సమస్యలను... ఏపీ ట్రాన్స పోర్ట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే



గుడివాడ (చైతన్యరథం): దశాబ్దాల చరిత్ర కలిగిన గుడివాడ ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ ఆటోమొబైల్ రంగా ఖ్యాతిని ఎట్టి పరిస్థితిలో తగ్గనివ్వనని ఆయన స్పష్టం చేశారు. ఏటీఎస్ విధానం వల్ల గుడివాడలోని వేలాది వాహనదారులకు కలిగే ఇబ్బందులు మరియు నష్టాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము... జేఏసీ నాయకులతో కలిసి ఏపీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా దృష్టికి మంగళవారం సాయంత్రం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులతో కలిసి విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే రాము వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రాముకు గుడివాడ ట్రాన్స్పోర్ట్ వాహన దారుల జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడారు.... ఏ.టి.ఎస్ సెంటర్‌ను జిల్లాకు ఒక మూలగా ఏర్పాటు చేయడం వల్ల కలిగే నష్టాలను కమిషనర్‌కు వివరించామన్నారు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకున్న కమిషనర్ సిన్హా కానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. 60 ఏళ్లుగా గుడివాడ ఆర్టీవో కార్యాలయం వాహనదారులకు సేవలు అందిస్తుందని, ఉమ్మడి కృష్ణా జిల్లాలో విజయవాడ తర్వాత అంత పెద్ద ఆటోమొబైల్ రంగం గుడివాడలో ఉండడం విశేషం అని ఆయన అన్నారు. తాము ఎన్ని పోరాటాలు చేసిన, అనుకున్న లక్ష్యాలు సాధించలేకపోయామని, ఎమ్మెల్యే రాము చొరవతో సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి చెరువ కావడం సంతోషకరమని జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# యువత కోసం ప్రత్యేక కృషి చేస్తున్న ఐటి శాఖ మంత్రి నారా లోకేష్

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించిన ఏపీ స్కిల్ డెవెలప్మెంట్ అధికారులు




గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తు కోసం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషి చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు బ్రాడీపేట మాస్టర్ మైండ్స్ క్యాంపస్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవెలప్మెంట్ వారి సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ జాబ్ మేళాను ప్రారంభించి, వారితో ముచ్చటించారు. సాయంత్రం వరకు జరిగిన ఈ ఇంటర్వ్యూ లలో 378 మంది ఎంపిక అయ్యారు.వారందరికీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, స్కిల్ డెవెలప్మెంట్ అధికారి సంజయ్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, మాస్టర్ మైండ్స్ మోహన్ కృష్ణ సహకారంతో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ జాబ్ మేళాకు 378 మంది నిరుద్యోగ యువత ఎంపికయ్యారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గము నుండే కాక ఇతర ప్రాంతాల నుండి యువత ఇంటర్వ్యూకు వచ్చారు. వచ్చిన యువతకు వారి అర్హతను బట్టి రూ.10,000 - 40,000 వరకు జీతాలు చెల్లించటానికి వచ్చిన కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్కిల్ డెవెలప్మెంట్ కేంద్రాల ఏర్పాటు కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారని గళ్ళా మాధవి తెలిపారు.

# రహదారి ప్రమాద బాధిత కుటుంబాలకు చీఫ్ విప్ జీవీ పరామర్శ, సాయం

### ● వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా అండగా ఉంటామన్న చీఫ్‌విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): శావల్యాపురం మండలం కనమర్లపూడి వద్ద ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని, ప్రమాదాల నివారణకు ఏం చేయాలో కూడా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంగళవారం ఈ మేరకు డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను సందర్శించి నివాళు లర్పించారు. మృతదేహాల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడిన జీవీ ప్రమాదంలో కారుమంచికి చెందిన ఓకే కుటుంబం నుంచి నలుగురు మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలవడం కలచి వేసిందన్నారు. శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధితుల్లో ఒకరికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉందని, వారికి పార్టీపరంగా వచ్చే బీమా పరిహారం వేగంగా వచ్చేలా చూస్తామన్నారు. ప్రభుత్వ పరంగా కూడా సాయానికి అవకాశం ఉన్న మార్గాలు చూస్తామన్నారు. ఇదే సమయంలో వర్షాకాలం నేపథ్యంలో వాహనాలు డ్రైవ్ చేస్తున్న సమయంలో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాలు స్లిప్ అయ్యే ప్రమాదం ఉన్న పరిస్థితుల్లో వేగం విషయంలో నియంత్రణ పాటించాలన్నారు. తర్వాత మాట్లాడిన జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు రహదారి ప్రమాదంలో మరణాలు చాలా బాధాకరం. దురదృష్టకరమన్నారు. ఆటోల్లో ఓవర్ లోడ్‌తో ప్రయాణించడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి అంటే ధూళిపాళ్ళ...

# ధూళిపాళ్ళ అంటే అభివృద్ధి

### ●వివాదాలకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకం

### ●అధికారంలోనూ ప్రతిపక్షంలోనూ వైసీపీ విధ్వంసకరం సృష్టించింది

### ●అంబటి మురళి కృష్ణ వాక్యాలను ఖండించిన కూటమి నాయకులు




పొన్నూరు (చైతన్యరథం): అభివృద్ధి అంటే ధూళిపాళ్ళ... ధూళిపాళ్ళ అంటే అభివృద్ధి అనే విధంగా నరేంద్రకుమార్ మరోసారి నిరూపించుకున్నారని నియోజకవర్గ టీడీపీ నాయకులు మైలా వెంకట రామరాజు వ్యాఖ్యానించారు. చెబ్రోలు మండలంలోని గుండవరం గ్రామానికి చెందిన రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ని గుండవరం గ్రామ ప్రజలు సంప్రదించగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడి సీజేఎఫ్ గ్రాంట్ కింద రూ.44లక్షలు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రధాన దాతైన గోపిశెట్టి కోటేశ్వరరావు దంపతులు రూ.23.50 లక్షల విరాళంతో ఆలయ పునః నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో దేవాలయాల కూల్చడమే తప్ప ఎక్కడ కూడా నిర్మించిన దాఖలు లేవని, వైసీపీ ప్రభుత్వంలో దేవాలయాలు కూల్చటమే లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడ్డారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పుడు రాజకీయాలు హుందాగ వ్యవహరించాలని, వైసీపీ నాయకులు మాత్రం అధికారంలోనూ ప్రతిపక్షంలోనూ విధ్వాంసాన్ని నమ్ముకున్నారని మండిపడ్డారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు మాట్లాడుతూ... వైసీపీ పొన్నూరు నియోజవర్గ ఇన్‌ఛార్జ్ అంబటి మురళీకృష్ణకు కనీసం పరిజ్ఞానం లేదన్నారు. వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణ వాఖ్యల అర్థరహితమన్నారు. ప్రభుత్వంపై బురదజల్లే వాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ చేయలేని అభివృద్ధిని కూటమి చేసి చూపిస్తుందని అదిచూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని అన్నారు.

# రైతుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

## రైతులపై జగన్ రెడ్డి మొసలి కన్నీరు, ఇంటింటికీ టీడీపీలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, చైతన్యరథం): రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గిద్దలూరు మండలంలోని కొంగలవీడు, బయనపల్లె, కొమ్మునూరు గ్రామాల్లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పర్యటించారు. కొంగలవీడు గ్రామంలో రూ.15 లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు, మరియు కొంగలవీడు గ్రామం నుండి నరవ గ్రామానికి రూ. 3 కోట్ల 20 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. వేములపాడు, కొమ్మునూరు గ్రామాల్లో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి మహిళలు, అవ్వా, తాతలతో మాట్లాడి, గ్రామంలోని



సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. ఏడాది పాలనా కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని, మహిళా సంక్షేమానికి, రైతుల సంక్షేమానికి, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గత వైసీపీ పాలకులు రైతులను నట్టేట ముంచిందని, రైతుల పేరు చెప్పుకొని నాడు అధికారంలోకి వచ్చి రైతుల మోటార్లకు మీటర్లు బిగించిన ఘనత జగన్ రెడ్డిదేనని అన్నారు. కూటమి పాలనలో రైతుల సంక్షేమం కోసం, గిట్టుబాటు ధరలు, పొగాకు, మామిడి కొనుగోళ్లకు కృషి చేస్తుంటే వైసీపీ అధినేత జగన్ రెడ్డి మాత్రం మొసలి కన్నీరు కార్చటం సిగ్గుచేటు అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20 వేలు అందచేస్తామని, మొదటి విడతగా ఆగష్టు 15 వ తేదీన రూ. 7 వేల రూపాయలు జమ చేయటం జరుగుతుందన్నారు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం ఎన్డీయే కూటమి ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి, కర్నాటి రామసుబ్బారెడ్డి, సర్పంచులు కడియం శేషగిరి, సొసైటీ బ్యాంకు డైరెక్టర్లు బద్రి గోపాల్ రెడ్డి, మండల నాయకులు నంది శ్రీను, దప్పిలి శ్రీనివాసరెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, మందగిరి రంగస్వామి, షేక్ షేక్షావలి, మరియు స్థానిక నాయకులు నాగిరెడ్డి పవన్, స్వామి రంగారెడ్డి, విష్ణురాజు, రాధామోహన్, పిచ్చయ్య, బాబాయ్, బూనబోయిన రాజశేఖర్, బాలరంగారెడ్డి, గంటా శేఖర్ రెడ్డి, పోలీరెడ్డి, ఆవుల గోపాల్, కోటిరెడ్డి, దిబ్బగండ్ల కాశన్న, కౌలూరి కాశన్న, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



### మంత్రి టీజీ భరత్‌ను కలిసిన అబ్దుల్ అజీజ్

నెల్లూరు, (చైతన్యరథం): కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాలెంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌ను నెల్లూరు నగరంలోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినఏపీ వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్.



సీఎస్ పురం మండలం ఉప్పలపాడు గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్తులనూ వివరిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

# ఉద్యోగుల కష్టాలు తెలిసిన సీఎం చంద్రబాబు

## కార్మికుల దీక్ష విరమింపచేసిన ఎమ్మెల్యే మాలకొండయ్య

చీరాల, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న క్రాంటాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ జీవోను విడుదల చేయడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఎదుట గత 11 రోజులుగా ఇంజనీరింగ్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేపట్టారు. కూటమి ప్రభుత్వ సమాన పనికి సమాన వేతనం కల్పిస్తూ జీతభత్యాలు పెంచడంతో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య యాదవ్ చీరాల పురపాలక సంఘం వద్దకు చేరుకొని కార్మికులతో నిమ్మరసం త్రాగించి సమ్మెను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు నెలల తరబడి దీక్షలు ధర్నాలు చేసినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని, ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీతభత్యాలు పెంచడంతో కార్మికులు సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల మున్సిపల్ చైర్మన్ మించాలా సాంబశివరావ, మున్సిపల్ కమిషనర్ రషీద, చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన, పీఏసీఎస్ అధ్యక్షుడు కోటి మోహన్ కృష్ణ, అధికారులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు మంగళవారం తెల్లవారుజామున చాతుర్మాస్య దీక్ష స్వీకరించారు.

# తిరుమలలో నూతన శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం

## ప్రారంభించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, (చైతన్యరథం): తిరుమలలో నూతన శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం ప్రారంభమయింది. అన్నమయ్య భవనం ఎదురుగా టికెట్ల కేంద్రాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె శ్యామలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడారు.శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు ఉదయం 5 గంటల నుంచే క్యూలైన్లలో నిలబడుతున్నారని బీఆర్ నాయుడు అన్నారు. ఈ నేపథ్యంలో సులభతరంగా టికెట్లు జారీ చేసేందుకు అత్యాధునిక మౌలిక సదుపాయాలతో రూ.60లక్షల వ్యయంతో నూతన కౌంటర్లను నిర్మించినట్లు చెప్పారు. బుధవారం నుంచే ఈ కౌంటర్ల ద్వారా టికెట్ల పంపిణీ ప్రారంభమవుతుందని.. భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం హెచ్వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో భక్తుల సౌలభ్యం కోసం నూతనంగా ఆధునీకరించిన ఉప విచారణ కార్యాలయాలను తితిదే చైర్మన్ ప్రారంభించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తితిదే బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్ల, జంగా కృష్ణమూర్తి, భానుప్రకాశ్ రెడ్డి, శాంతారామ్. నరేశ్, సదాశివరావు, నర్సిరెడ్డి, జానకీదేవి, తితిదే ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, అధికారులు పాల్గొన్నారు.



### ఆహార పరిశోధనశాలను ప్రారంభించిన తితిదే ఛైర్మన్

మరోవైపు తిరుమలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆహార నాణ్యత పరీక్ష పరిశోధనశాలను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్వామివారి ప్రసాదాలు, నెయ్యి లాంటి వస్తువుల నాణ్యతను పరీక్షించేందుకు ఇతర రాష్ట్రాలకు నమూనాలు పంపాల్సి వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు తిరుమలలోనే అత్యాధునిక పరికరాలతో నేరుగా పరీక్షలు నిర్వహించగలిగే విధంగా ల్యాబ్ను తీర్చిదిద్దినట్లు తెలిపారు.

# ఏపీ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

## పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి

పులివెందుల, (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా పులివెందుల మున్సిపాలిటీలోని చిన్న కొండా రెడ్డి కాలానిలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పులివెందుల ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల నుండి ప్రభుత్వంపై మద్దతు, సంతృప్తి స్పష్టంగా కనిపించింది. స్థానికులు కూటమి పాలనతో తాము సంతృప్తిగా ఉన్నామని తెలిపారు.



# హంద్రీనీవా జలాలకు గంగపూజ



### పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, (చైతన్యరథం): ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి గుంతకల్లు నియోజకవర్గం కసాపురం హంద్రీనీవా కాలవ వద్ద కాలవలో ప్రవేశించిన హంద్రీనీవా జలాలకు గంగ పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని చివరి వరకు తీసుకెల్లి రాయలసీమ ను సస్యాశ్యామలం చేయాలనే సంకల్పంతోనే హంద్రీనీవా కాలువ కు నీటిని విడుదల జరిగిందన్నారు. పరివాహక ప్రాంతాల రైతులు నీటిని వృధా చేయకుండా వాడుకుని సకాలంలో పంటలు పండించుకోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు.. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

### పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి వెల్లడి

పులివెందుల, (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. బీటెక్ రవి నివాసంలో ప్రజా దర్భార్ కార్యక్రమం జరిగింది. పలు సమస్యలతో వచ్చిన ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నాయని రవి అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుండడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజా, సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కారం చేసే దిశగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజాదర్భార్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలు పరిశీలించి వాటిని పరిష్కారం చేసి అర్జీదారులకు తెలపాలని అధికారులకు సూచించారు.



# సీఎం చంద్రబాబుతోనే ప్రాజెక్టులకు మోక్షం

### రాజంపేట టీడీపీ నేతల స్పష్టీకరణ

రాజంపేట, (చైతన్యరథం): సీఎం చంద్రబాబు చేతిలోనే ప్రాజెక్టులు పూర్తవుతాయని రాజంపేట టీడీపీ నేతల వెల్లడించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ బిడ్డ అని చెప్పుకుంటున్న వారు చేసిందేమీ లేదన్నారు. రాయలసీమ రైతాంగానికి ఉపయోగపడేలా రెండు దశలుగా ప్రాజెక్టులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 13, 635 కోట్లకు అనుమతులు ఇచ్చారన్నారు. జగన్ రెడ్డి హయాంలో 5 ఏళ్లలో 515 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. జగన్ హయాంలో బిల్లులు రాక పనులు ఆగి పోయాయన్నారు. జీవో నెంబర్ 30 ద్వారా దోచుకునే ప్రయత్నాలు సాగించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో హంద్రీనీవా కోసం 3873 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు 6,02,500 ఎకరాలకు సాగునీరు లభిస్తుందన్నారు. 81 మండలాలలో 33 లక్షల మందికి తాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షులు శివ నారాయణ చౌదరి, ముళ్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, దాసరి కళాధర్, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పరశురాం నాయుడు, సిద్ధిక్, పాల్గొన్నారు.





# ముదిగుబ్బకు హంద్రీనీవా నీరు

### ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ హామీ
### యోగివేమన రిజర్వాయర్‌కు నీరందించే పనుల పరిశీలన

ధర్మవరం, (చైతన్యరథం): హంద్రీనీవా కాలువ ద్వారా ముదిగుబ్బ మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ముదిగుబ్బ మండలం మలకవేముల దగ్గర హంద్రీనివా కాలువ ప్రాంతాన్ని శ్రీరామ్ పరిశీలించారు. హంద్రీనీవా అధికారులతో పాటు మైనర్ ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు ఆయన వెంట వచ్చారు. ప్రస్తుతం కాలువ లైనింగ్ జరుగుతున్న నేపథ్యంలో ముదిగుబ్బ మండలంలోని యోగివేమన రిజర్వాయర్ తో పాటు పలు చెరువులకు నీరందించేలా రెండు గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను శ్రీరామ్ స్వయంగా పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. ఈ రెండు గేట్ల ద్వారా సానేవారిపల్లి చెరువు నుంచి మద్దిలేరు వంక మీదుగా యోగివేమనకు నీరందేలా ప్రణాళిక చేశారు. మార్గమధ్యలో సుమారు చెక్ డ్యామ్ లు,కుంటలకు నీరు అందనుంది. అయితే రైతులు ఇంకా కొన్ని ప్రాంతాలకు నీరందించాలని శ్రీరామ్‌కు విజ్ఞప్తి చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు కాలువకు మరో రెండు గేట్లు అదనంగా పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ విషయంపై జలవనరులశాఖ మంత్రితో పాటు హంద్రీనీవా అధికారులతో మాట్లాడుతామన్నారు. ముదిగుబ్బ మండలంలో మొదటి నుంచి సాగు, తాగునీటి సమస్య ఉందన్నారు. గత ఐదేళ్లలో దీనిని ఎవరూ పట్టించుకోలేదని.. ఎన్నికల ముందే తాము హామీ ఇచ్చిన విధంగా ఇక్కడ సాగు, తాగునీటి సమస్య తీరుస్తామన్నారు. హంద్రీనీవా కాలువకు లైనింగ్ చేస్తున్న నేపథ్యంలో చెరువులకు, రిజర్వాయర్ కు నీరందించే విధంగా గేట్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతంలో వీలైనంత ఎక్కువ చెరువులకు, భూములకు నీరందిస్తామన్నారు. రానున్న రెండేళ్లలో ఈ ప్రాంతంలో నీటి సమస్య తీరుతుందని శ్రీరామ్ అన్నారు...

### టీడీపీ నాయకుడికి పరామర్శ

ముదిగుబ్బ మండలం మలకవేముల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బండి మల్లికార్జున కుమారుడు రూపేంద్ర ఇటీవల ప్రమాదవశాత్తు మరణించాడు. విషయం తెలుసుకున్న శ్రీరామ్ గ్రామంలోని మల్లికార్జున ఇంటికి వెళ్లారు. మల్లికార్జునతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూపేంద్ర మరణం చాలా బాధాకరమని శ్రీరామ్ అన్నారు. ధైర్యంగా ఉండాలని మల్లికార్జున కుటుంబసభ్యులను ఓదార్చారు.

## కొండాపురంలో ఇంటింటికీ టీడీపీ

జమ్మలమడుగు, (చైతన్యరథం): కొండాపురం మండలం అనంతపురం గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి ఇంటింటికీ వెళ్లారు. గ్రామం లోని ప్రజలని ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకి ఫోన్ చేసి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నాలుగేళ్లలో భారీ పారిశ్రామికవాడగా రాప్తాడు

### హంపాపురంలో సుపరిపాలనలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, (చైతన్యరథం): రానున్న నాలుగేళ్లలో రాప్తాడు మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. పూల బొకేలు, పూలహారాలను తీసుకురావద్దని ఇప్పటికే ఎమ్మెల్యే కార్యాలయం విజ్ఞప్తి చేయగా.. గ్రామస్థులు వాటి స్థానంలో పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోట్ బుక్స్, పెన్నులు తీసుకొచ్చారు. వాటిని ఎమ్మెల్యే సునీతకు అందజేయగా స్థానిక పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో వ్యవసాయశాఖ ద్వారా అన్నదాత రైతు సేవా సంఘం వారికి 8లక్షల సబ్సిడీతో డ్రోన్ ను అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు. డ్రోన్ ద్వారా పొలాలకు మందుల పిచికారి చేసే విధానాన్ని ఎమ్మెల్యే సమక్షంలో రైతులకు వివరించారు. అనంతరం 50లక్షలఎన్ఆర్ఈజీఎస్, మండల, పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ఆమె గ్రామంలో ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏడాది కాలంలో ఒక్కో ఇంట్లో ఎంత లబ్ధి జరిగిందన్నది వివరించారు. ఈ ఒక్క గ్రామంలో గతంలో 1 కోటి నిధులతో బీసీ హాస్టల్ భవనం, 1.50కోట్లతో సీసీ రోడ్లు, ఈ సంవత్సరం 9 లక్షల 20 వేలతో గోకులం షెడ్లు, 28 మందికి 26 లక్షలు 36 వేలతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందజేసినట్టు చెప్పారు. డ్వాక్రా మహిళా సంఘాలకు 11 కోట్లు 45 లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. రాప్తాడు మండలంలో 12కోట్లతో రోడ్ల నిర్మాణాలు, 6,163 మందికి సంవత్సరానికి 35 కోట్ల 47లక్షలు పింఛన్ల రూపంలో అందజేసినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద 33 మందికి 24లక్షలు, 6,696 గృహాలకు కొళాయి కనెక్షన్లకు 1 కోట్ల 22 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. తల్లికి వందనం 5,017 మందికి 6 కోట్ల 52 లక్షలు అందిందన్నారు. 12,539 రేషన్ కార్డులు, 4 కోట్ల 52 లక్షలు ఉపాధి హామీ నిధులు ఇచ్చారన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలకు 27 కోట్ల 35 లక్షలు ఇచ్చారన్నారు. 6కోట్లతో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. ఏడాది కాలంలోనే ఇన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని.. రానున్న నాలుగేళ్లలో ఇంకా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చూస్తారన్నారు. ముఖ్యంగా రాప్తాడులో ఇప్పటికే జాకీ పరిశ్రమను వైసీపీ నాయకులు కమీషన్ల కోసం వెళ్లగొట్టారన్నారు. అందుకే ఆ పరిశ్రమ స్థానంలో రేమాండ్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. ఇలాంటి పరిశ్రమలు మరిన్ని తీసుకొస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు. గ్రామస్తుల కోరికమేరకు చిగిచెర్ల - ధర్మవరం లింక్ వరకు ఉన్న మట్టి రోడ్డు స్థానంలో తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు.



# ఇక మిగ్ విమానాలకు సెలవు

## చండీఘర్‌లో వీడ్కోలు వేడుక



భారత వాయుసేనకు కొన్నేళ్లపాటు వెన్నెముకగా నిలిచిన మిగ్ 21 విమానాలకు నెలవు ప్రకటించనున్నారు. విషయాన్ని ఐఏఎఫ్ వెల్లడించింది. దీనికి సంబంధించి సెప్టెంబర్ 3వ తేదీన చండీఘర్‌లో వేడుకను నిర్వహించనున్నారు ఇందులో మిగ్ 21ల స్క్వాడ్రన్ పాంథర్స్ ఉంది. ఇది అధికారికంగా విశ్రాంతి తీసుకోనున్నది. ఈ ఫైటర్ విమానాల స్థానాన్ని దేశీయంగా తయారు చేసిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్ ఎంకే 1ఏతో భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం వాయు సేనలో మిగ్ 31, 21 విమానాలు పని చేస్తున్నాయి. విమానాలు తొలి సారి వాయుసేవలో 1963లో చేరాయి. దాదాపు 850 పైగా మిగ్‌లు వాయుసేనలో వివిధ దశల్లో సేవలు అందించాయి. వీటిల్లో 600 దేశీయంగా హిందుస్థాన్ ఏరోనాటిస్ట్ లిమిటెడ్ (హాల్)లో తయారు చేశారు. భారత వాయుసేనలో చేరిన తొలి సూపర్సోనిక్ ఫైటర్ జెట్లుగా మిగ్–21లు నిలిచాయి. 1960–70 సంవత్సరాల్లో భారత్కు గగనతల యుద్ధంలో ఇవి అదనపు బలంగా మారాయి. వాస్తవానికి అప్పట్లో ఇవి సాంకేతిక పరంగా పశ్చిమదేశాలకు కూడా కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ఈ టెక్నాలజీని సొంతం చేసుకోవడానికి ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ దీనిని దొంగిలించిందంటే ఈ జెట్ సత్తా ఏంటో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ఈ యుద్ధ విమానాన్ని నడిపిన పైలట్లు మరో దానివైపు పెద్దగా మొగ్గుచూపరనే పేరుంది. గాల్లో చురుగ్గా కదలడం, అత్యధిక వేగాన్ని అందుకోవడం దీనిలో ప్రత్యేకతలు. ప్రస్తుతం విమానాలు ఫైబైవైర్ వ్యవస్థతో వేగాన్ని నియంత్రిస్తుండగా.. మిగ్‌లు గేర్ సిస్టమ్‌తో నిచేస్తాయి. ఫలితంగా ఇది గంటకు 2 వేల కిలోమీటర్లకు పైగా వేగాన్ని అందుకోగలదు. అంత వేగాన్ని నియంత్రించలేకపోవడం కూడా ఓ లోపంగా మారి ప్రమాదాలకు కారణమవుతోంది.

భారత వాయుసేన నివేదికల ప్రకారం.. మిగ్–21 యుద్ధ విమానాలు అనేక ఆపరేషన్లలో పాల్గొన్నాయి. 1971 యుద్ధంలో ఇండియాకు అద్భుత విజయం చేకూరడం వెనక మిగ్‌ల శక్తి దాగి ఉంది. 2019లో బాలాకోట్ దాడుల అనంతరం పాక్ విమానాలు జమ్మూకశ్మీర్లో చొరబడితే.. వాటిని తరిమేందుకు తొలుత రంగంలోకి దిగింది కూడా మిగ్–21 ఫైటర్ జెట్లే.

**ప్రాణాంతకంగా మారి..**

1985లోనే సోవియట్ యూనియన్ మిగ్–21లను తమ దళం నుంచి తొలగించింది. భారత్ వాయుసేనలో మాత్రం ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. కాలం చెల్లిన వాటిని ఇంకెప్పుడు తొలగిస్తారని పలువురు రాజకీయ నేతలు, మాజీ వైమానిక దళ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మన దగ్గర సుఖోయ్, రఫేల్, తేజస్ వంటి యుద్ధ విమానాలున్నాయి. కానీ, వాటి సంఖ్య చాలా పరిమితం. దాంతో భారత వాయుసేన అవసరాలు తీరడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో సోవియట్ యూనియన్ కాలంలో రూపొందించిన ఈ మిగ్–21లను ఇంకా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఐఏఎఫ్ 872 మిగ్ విమానాల్లో 482 కూలిపోయినట్లు 2012లోనే నాటి రక్షణమంత్రి ఏకే ఆంటోని రాజ్యసభలో వెల్లడించారు. నాటి లెక్కల ప్రకారమే 171 మంది పైలట్లు, 39 మంది పౌరులు మృతి చెందారు. వీటిల్లో 298 మిగ్–21లే ఉన్నాయి. భారత వాయుసేనలో అత్యధికంగా కూలిపోయిన ఫైటర్ జెట్లు కూడా ఇవే.

# ఉప రాష్ట్రపతి రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం


## అనారోగ్యమే కారణమని ధన్‌ఖడ్ వెల్లడి - వెనుక కనిపించని కారణాలున్నాయన్న కాంగ్రెస్



ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాను మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. ఈ సమాచారాన్ని రాష్ట్రపతి కార్యాలయం హెూం మంత్రిత్వ శాఖకు తెలియజేసింది. దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్‌ఖడ్ రాజీనామా చేయడంపై ప్రధాని మోదీ స్పందించారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి పదవితో సహా వివిధ హెూదాల్లో ధన్‌ఖడ్ దేశానికి సేవలు అందించారని అన్నారు. రాజ్యసభ చైర్మన్ హెూదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు. రాత్రి కల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. "వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా నేను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. బాధ్యతల నిర్వహణలో నాకు అండగా నిలిచిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు. పదవీకాలంలో మేం చాలా ప్రశాంతమైన, అద్భుతమైన వర్కింగ్ రిలేషన్‌ను కొనసాగించాం. ప్రధాన మంత్రి, మంత్రి మండలికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ధన్యవాదాలు తెలిపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్ 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. దేశ 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన సోమవారం సాయంత్రం వరకూ ఆరోగ్యంగా కనిపించినప్పటికీ రాత్రికి అదే కారణంతో రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ధనడ్ రాజీనామా ఊహించని పరిణామమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆరోగ్య అంశం కంటికి కనిపిస్తున్నా కనిపించనివి ఏవో దీనివెనక ఉండి ఉంటాయని అనుమానం వ్యక్తం చేసింది.

# నాకు రమ్మీ ఆడడం రాదు

## విపక్షాల ఆరోపణలపై మహారాష్ట్రమంత్రి ఫైర్



అసెంబ్లీ సమావేశాల్లో మహారాష్ట్ర మంత్రి మాణిక్‌రావ్ కోకాటే రమ్మీ ఆడారంటూ ఓ వీడియోను విపక్షాలు వైరల్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా సదరు మంత్రి స్పందించారు.. తనకు అసలు ఆన్లైన్ రమ్మీ ఆడటమే తెలియదని మీడియాతో మాట్లాడారు. "నాకు రమ్మీ ఆడటం తెలియదు. ఆ గేమ్ ఆడాలంటే.. బ్యాంక్ ఖాతాతో లింక్ అయిఉండాలి. నా నంబర్ లింక్ అయిందో, లేదో చెక్ చేసుకోవచ్చు. ఆ సమయంలో నా ఫోన్ తెరపై రమ్మీకి సంబంధించి వచ్చిన పాప్‌అప్ను స్కిప్ చేయడానికి ప్రయత్నిస్తున్నాను" అని మంత్రి వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. దీనిపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ఆ వీడియోపై విచారణ చేయాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖ రాస్తానని వెల్లడించారు. మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్రావ్ కోకాటె అసెంబ్లీ సమావేశాల సమయంలో ఫోన్లో రమ్మీ ఆడుతున్నారని ఎన్సీపీ (శరద్ పవార్‌వర్గం) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపిస్తూ, కొన్ని దృశ్యాలను నెట్టింట్లో పంచుకున్నారు. రైతులు. వ్యవసాయ సమస్యల గురించి సభలో చర్చ జరుగుతున్న సమయంలో రాష్ట్ర మంత్రి ఇలా వ్యవహరించారని మండిపడ్డారు. రాష్ట్రంలో రోజుకు 8 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వ్యవసాయ మంత్రి వీటన్నింటినీ పట్టించుకోకుండా ఆటలాడుతున్నారని ధ్వజమెత్తారు..

ఇక, ఈ సంఘటనపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడం లేదని ఆరోపిస్తున్నాయి. దీనిపై శివసేన (యూబీటీ) ప్రతినిధి ఆనంద్ దూబే స్పందిస్తూ.. మంత్రి కోకాటె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

# రాష్ట్రపతికి కోర్టుల ఆదేశాలివ్వచ్చా

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు

శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. దీనిపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణను చేపట్టింది. వచ్చే మంగళవారం నాటికి దీనిపై స్పందన తెలియజేయాలని ఆదేశించింది. ఇది ఒక రాష్ట్రానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, మొత్తం దేశానికి సంబంధించిన విషయమని గమనించాలని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ శాసనసభలు ఆమోదించిన బిల్లులపై ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి ఒక కాల వ్యవధిలోగా చర్యలు తీసుకోవాలని గత ఏప్రిల్లో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తనకు రాజ్యాంగంలోని 143(1) అధికరణం ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొని 14 కీలక ప్రశ్నలను అత్యున్నత న్యాయస్థానం ముందుంచారు. ప్రజా ప్రయోజనంతో ముడిపడివున్న చట్టపరమైన అంశాలపై రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయం తెలుసుకునేందుకు ఆ కోర్టు ముందు తన ప్రశ్నను ఉంచవచ్చని, సుప్రీంకోర్టు దానిపై విచారణ జరిపి తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియజేయవచ్చని 143(1) అధికరణం తెలియజేస్తోంది.

# ఎయిరిండియా విమానంలో మంటలు

## - ప్రయాణికులు సురక్షితం

ఎయిరిండియా విమానంలో మంటలు చెలరేగాయి. హాంకాంగ్ నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చిన విమానం ఎ1 315 ల్యాండింగ్ అయిన కాసేపటికే పవర్ యూనిట్లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించింది.."హాంకాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చిన విమానం ల్యాండ్ అయిన కొద్దిసేపటికే ఆగ్జలరీ పవర్ యూనిట్ మంటలు చెలరేగాయి. ప్రయాణికులు విమానం దిగడం ప్రారంభించిన వెంటనే ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో విమానం స్వల్పంగా దెబ్బతింది. ప్రయాణికులు, సిబ్బంది. సాధారణంగానే దిగి సురక్షితంగా ఉన్నారు. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కోసం విమానాన్ని నిలిపివేశాం" అని ఎయిరిండియా 'ఎక్స్'లో పేర్కొంది.

# కాంగ్రెస్‌లో కేరళ నేతల కలకలం

## ఆయనను దూరం పెట్టాం : మురళీధరన్

## అలా చెప్పడానికి ఆయనకు అధికారమేముంది

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్‌కు సొంత పార్టీ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో అతన్ని పార్టీ కార్యకలాపాలకు దూరం పెడుతున్నామంటూ కాంగ్రెస్‌కు చెందిన మరోనేత మురళీధరన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా థరూర్ స్పందిస్తూ అలా చెప్పడానికి ఆయనకు పార్టీలో ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. మురళీధరన్ వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా థరూర్ స్పందిస్తూ ఇలాంటి వాదనలు చేయడానికి వారి వద్ద ఎలాంటి ఆధారం ఉందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు చేస్తున్న వారికి పార్టీలో ఏ అధికారం లేదంటూ మురళీధరన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. కొంతమంది ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని, వాటిన్నింటికీ స్పందించాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. వేరేవాళ్ల ప్రవర్తన గురించి తనను అడగొద్దని, తన గురించి మాత్రమే మాట్లాడతానని వ్యాఖ్యానించారు. పార్టీ ప్రయోజనాల కంటే దేశానికే ప్రాధాన్యం ఇవ్వాలని థరూర్ పలుమార్లు ఉద్ఘాటించారు. దీనిపై మురళీధరన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. శశిథరూర్ తన తీరు మార్చుకునే వరకు తిరువనంతపురంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించబోమన్నారు. మాతో కలిసి లేరని అందువల్ల ఆయనను బహిష్కరించే ప్రశ్నే ఉత్పన్నం కాదని అన్నారు. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. కేరళలోని యూడీఎఫ్ నేతల్లో సీఎం అభ్యర్థిగా శశిథరూర్ వైపే మొగ్గు ఉందంటూ ఓ సర్వేకు సంబంధించిన పోస్టుపైన మురళీధరన్ గతంలోనూ విరుచుకుపడ్డారు. ఆయన ఏ పార్టీకి చెందినవారో ముందు నిర్ణయించుకోవాలన్నారు.

# శవాల గుట్టగా గాజా



- 59వేలు దాటిన పాలస్తీనా మృతుల సంఖ్య
- అధికశాతం మహిళలు, పిల్లలే మృతి
- యుద్ధం ఆపాలంటూ 25 దేశాల సంయుక్త ప్రకటన

గడచిన 21 నెలలుగా గాజాలో సాగుతున్న యుద్ధంలో మరణించిన పాలస్తీనీయుల సంఖ్య 59 వేలు దాటిపోయిందని ఇక్కడి వైద్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2023 అక్టోబరు 7న యుద్ధం ప్రారంభమైన నాటినుంచి మొత్తం 59,029 మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారని, మరో 1.42 లక్షల మంది క్షతగాత్రులయ్యారని ఆ శాఖ వెల్లడించింది. అయితే వీరిలో ఎందరు పోరాడుతూ మరణించారు. ఎందరు సాధారణ పౌరులన్న వివరాలను వైద్య శాఖ తెలపలేదు. మృతుల్లో సగంమంది మహిళలు, పిల్లలేనని పేర్కొంది. మరోవైపు ఆకలికి తాళలేక అన్నం కోసం పడిగాపులు కాస్తున్న గాజా వాసులపై ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు, తుపాకీ గుళ్లతో దాడికి పాల్పడుతోందని ప్రపంచ ఆహార సంస్థ (డబ్ల్యుఎఫ్‌ఓ) పేర్కొంది. ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలు కలిగిన డబ్ల్యూఎఫ్‌వో చేసిన ఈ ఆరోపణ వాస్తవ పరిస్థితికి అద్దం పట్టింది. గాజాలో ఆహారం నిండివున్న వాహనాల కాన్వాయ్ వైపు దూసుకెళ్లిన పాలస్తీనా జన సమూహంపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో ఆదివారం 80మంది మృతి చెందారు. ముప్పు ముంచుకొస్తున్నట్టుగా భావించి హెచ్చరిక రూపేణా గాలిలో కాల్పులు జరిపాకే.. జన సమూహంపై గురి పెట్టామని ఇజ్రాయెల్ చెప్పుకొచ్చింది. మరణాల సంఖ్యను ఎక్కువ చేసి చూపుతున్నారని తెలిపింది. మరోవైపు ఇజ్రాయెల్ దళాలు మధ్య గాజా నగరంలోకి ప్రవేశించాయి. ఈ ప్రాంతంలోకి ఇజ్రాయెల్ భూదళాలు ప్రవేశించడం ఇదే మొదటిసారి.

**గాజాలో యుద్ధం ఆగి తీరాలి: 25 దేశాల సంయుక్త ప్రకటన**

గాజాలో యుద్ధం ఆగి తీరాలని, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ గౌరవివాలని బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్లతో సహా మొత్తం 25 దేశాలు సోమవారం సంయుక్త ప్రకటన వెలువరించాయి. కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో సామాన్యుల కష్టాలు మరింతగా పెరిగాయని ఆయా దేశాల విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. చాలీచాలని సాయం అందించడమే కాక, కనీస అవసరాలైన ఆహారం, నీళ్ల కోసం వేచివున్న అమాయక ప్రజల్ని, మహిళలు, పిల్లలను విచక్షణ లేకుండా హతమార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. "ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుసరిస్తున్న సహాయ పంపిణీ విధానం అత్యంత ప్రమాదకరం. ఇది అస్థిరతను పెంపొందించడంతోపాటు గాజావాసుల కనీస మానవ గౌరవాన్ని హరిస్తోంది" అని సంయుక్త ప్రకటన తెలియజేసింది.

# ఐఎంఎఫ్‌కు గీత రాంరాం



అంతర్జాతీయ ద్రవ్యనిధిలో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న గీతా గోపీనాథ్ ఆగస్టులో తన పదవి నుంచి వైదొలగనున్నారు. ఐఎంఎఫ్ ఈ మేరకు ఓ ప్రకట నలో పేర్కొంది. పదవి నుంచి వైదొలగిన తర్వాత ఆమె తిరిగి హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేరను న్నారు. ఆమె తర్వాత ఆ పదవి చేపట్టే వ్యక్తి పేరును త్వర లోనే ప్రకటిస్తామని ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలిన్ జార్జివా తెలిపారు. 2019లో చీఫ్ ఎకనామిస్ట్‌గా గీతా ఐఎంఎఫ్‌లో చేరారు. ఆ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ గీత గోపీనాథ్.

## కీవ్‌పై దాడులు ఆపని రష్యా

- తాజా దాడుల్లో ఇద్దరి మృతి



ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై రష్యా సోమవారం క్షిపణులు, డ్రోన్లతో అతి పెద్ద దాడికి పాల్పడింది. దాడిలో ఇద్దరు మరణించారని, 15 మంది క్షతగాత్రులయ్యారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ వెల్లడించారు. నాటో కూటమి ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు అందించాలన్న ట్రంప్ ప్రతిపాదనపై చర్చించేందుకు నిర్వహించనున్న సమావేశం మరికొన్ని గంటల్లో జరగనుండగా రష్యా తన దాడుల్ని తీవ్రం చేయడం గమనార్హం. బ్రిటన్ రక్షణ మంత్రి జాన్ హెలీ, జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్లు ఈ ఆన్‌లైన్ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్, నాటో నాయకుడు మార్క్ రుట్, నాటో బలగాల సుప్రీం కమాండర్ జనరల్ అలెక్స్ గ్రింకెవిచ్‌లు సమావేశంలో పాల్గొననున్నారు. మరో 50 రోజుల్లో కాల్పుల విరమణకు అంగీకరించకుంటే రష్యాపై మరిన్ని ఆంక్షలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల హెచ్చరించిన సంగతి తెలిసిందే.

బ్రిటన్ ఆంక్షలు: రష్యాపై బ్రిటన్ తాజాగా ఆంక్షలు ప్రకటించింది. ఇప్పటికే కష్టకాలంలో ఉన్న రష్యా చమురు రంగాన్ని ఈ ఆంక్షలు మరింత దెబ్బతీస్తాయని భావిస్తున్నారు. ఈ కొత్త ఆంక్షలు పుతిన్‌కు రహస్యంగా అందుతున్న చమురు ఆదాయానికి గండి కొడతాయని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ ల్యామీ అన్నారు.


## సిరియాలో ఇజ్రాయెల్ జోక్యం తగదు

- హెచ్చరిక స్వరంతో అమెరికా నిలదీత

సిరియాలో సాయుధుల మధ్య సాగుతున్న పోరాటంలో ఇజ్రాయెల్ జోక్యాన్ని అమెరికా తప్పుబట్టింది. సిరియా ప్రభుత్వ దళాలపై దాడికి పాల్పడటం ద్వారా ఈ ప్రాంతంలో సుస్థిరత సాధించడం కోసం జరుగుతున్న ప్రయత్నాలకు ఇజ్రాయెల్ విఘాతం కలిగించిందని అమెరికా రాయబారి టామ్ బరాక్ ఆరోపించారు. సిరియాలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వానికి అమెరికా మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. టామ్ బరాక్ తుర్కియేలో అమెరికా రాయబారిగా, సిరియాకు ప్రత్యేక దూతగా, లెబనాన్‌కు తాత్కాలిక దౌత్యాధికారిగా పనిచేస్తున్నారు. సిరియాపై దాడికి సంబంధించి ఇజ్రాయెల్ అమెరికాను సంప్రదించలేదని ఆయన అన్నారు. సిరియాలోని స్వెయిదా రాష్ట్రంలో సాయుధ మిలీషియాకు, డ్రూజ్ మైనారిటీ వర్గానికి, సున్నీ బెద్విన్ తెగలకు మధ్య వారం రోజులుగా సాగుతున్న పోరాటాన్ని ఆదివారం విరమించిన సంగతి తెలిసిందే. సిరియా ప్రభుత్వం సోమవారం స్వెయిదా నగరంలో చిక్కుకున్న బెద్విన్ తెగల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ప్రారంభించింది.

# ట్రంప్ మెడకు ఎప్‌స్టీన్ ఫైల్స్!

**వైరల్ అవుతున్న కళాకారిణి మారియా వ్యాఖ్యలు**



రెండో విడత పాలనలోనూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలు వెంటాడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతున్న జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ఫైల్స్ విడుదల చేస్తానంటూ ఇచ్చిన హామీ.. ఆయన మెడకే చుట్టుకుంటోంది. అసలు ఎప్‌స్టీన్ వ్యవహారంపై కొన్ని దశాబ్దాల క్రితమే దర్యాప్తు కోరిన అమెరికన్ కళాకారిణి మారియా ఫార్మర్ తాజాగా దేశాధ్యక్షుడిపైనా సంచలన ఆరోపణలు చేశారు. ఓ సందర్భంలో ట్రంప్ తనకు ఎదురుపడగా.. అసభ్యకరంగా చూశారని పేర్కొన్నారు. నాటి చేదు అనుభవాన్ని ఇటీవల న్యూయార్క్ టైమ్స్ పత్రికతో మారియా పంచుకొన్నారు. 1995లో ఎప్‌స్టీన్ కోసం పనిచేయడానికి సిద్ధమవుతున్నానని చెప్పారు. ఒకరోజు బాగా పొద్దుపోయాక ఎప్‌స్టీన్ ఫోన్ చేసి తనను మన్‌హటన్‌లోని ఆఫీసులో కలవాలని ఫోన్ చేసినట్టు తెలిపారు. తాను రన్నింగ్ షార్ట్స్‌లోనే ఆఫీసుకు వెళ్లినట్టు పేర్కొన్నారు. అదే సమయంలో ట్రంప్ బిజినెస్ సూట్ ధరించి అక్కడికి వచ్చారని గుర్తు చేసుకొన్నారు. తనకు సమీపంలోనే ట్రంప్ నిలబడి వేచి చూస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో ట్రంప్ తన కాళ్లవైపు అదేపనిగా చూడటాన్ని గమనించినట్టు వెల్లడించారు. ఆ సమయంలో తనకు భయం వేసినట్టు మారియా పేర్కొన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఎప్‌స్టీన్ "నో..నో.. ఆమె నీకోసం కాదు" అంటూ ట్రంపును అక్కడి నుంచి తీసుకెళ్లారన్నారు. ఆ సమయంలో తనకు 16 ఏళ్లు ఉంటాయని అనుకొన్నట్టు ట్రంప్ వ్యాఖ్యానించారన్నారు. వాస్తవానికి అప్పటికే మారియా వయసు 20ల్లో ఉంది. అయితే, మారియా వ్యాఖ్యలతో వచ్చిన కథనంపై శ్వేతసౌధం స్పందించింది. ఎప్‌స్టీన్‌తో స్నేహాన్ని ట్రంప్ వదిలేసి చాలాకాలం అవుతోందని పేర్కొంది. దీంతోపాటు అధ్యక్షుడు ఏనాడూ ఎప్‌స్టీన్ ఆఫీసుకు వెళ్లలేదని పేర్కొంది. ఈమేరకు శ్వేతసౌధం కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ వెల్లడించారు. వాస్తవానికి ఎప్‌స్టీన్ చెత్త ప్రవర్తనతో విసిగిపోయిన ట్రంప్ అతడిని తన క్లబ్‌నుంచి వెళ్లగొట్టారన్నారు.

మారియా 1996లోనే ఎప్‌స్టీన్, మ్యాక్స్‌వెల్ సెక్స్ ట్రాఫికింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. నాడు ఎఫ్‌బీఐకి వీరిపై సమాచారం అందించారు. ఆ సందర్భంగా ట్రంప్ పేరును కూడా ప్రస్తావించినట్టు పేర్కొన్నారు. 2006లో కూడా ఎఫ్‌బీఐ ఇంటర్వ్యూలో ట్రంప్ పేరును మరోసారి ఆమె ప్రస్తావించారు.

# కేఎన్‌పీ.. క్లోజ్!

**హ్యాకర్ల దెబ్బకు షట్టర్లు దింపేసిన కంపెనీ**





చిన్న చిల్లే పెద్ద పడవను ముంచేస్తుందన్న సామెత –యూకేలోని ఓ కంపెనీకి అతికినట్టు సరిపోతుంది. ఒక్క తప్పు 158 ఏళ్ల కంపెనీని నిట్టనిలువునా ముంచేసి.. 700మంది ఉద్యోగులు వీధిన పడేటట్టు చేసింది. యూకేకు చెందిన కేఎన్‌పీ లాజిస్టిక్స్ 158 ఏళ్లనుంచి రవాణారంగంలో వ్యాపారం చేస్తోంది. ఈ కంపెనీ దాదాపు 500 లారీలను నిర్వహిస్తోంది. వీటిని 'ది నైట్స్ ఆఫ్ ఓల్డ్' అనే బ్రాండ్‌కింద నడుపుతోంది. ఈ సంస్థ పరిశ్రమకు సంబంధించిన ప్రమాణాలను బలంగా పాటిస్తుంది. ఈక్రమంలో సైబర్ అటాక్ బీమా కూడా తీసుకొంది. అయినా.. అకిర గ్యాంగ్ హ్యాకర్ల రాన్సమ్‌వేర్ బారినపడి విలవిల్లాడింది. ఈ ముఠా కేఎన్‌పీ సిస్టమ్స్‌లోకి అనధికారికంగా చొరబడింది. అక్కడ ఉన్న డేటాను ఎన్‌క్రిప్ట్ ఫార్మాట్‌లోకి మార్చేసి.. ఉద్యోగులకు దాని యాక్సెస్ లేకుండా చేసింది. తిరిగి డేటాను పొందాలంటే కొంత మొత్తం చెల్లించాలని డిమాండ్ చేసింది.

"మీరు ఇది చదివితే.. మీ కంపెనీ అంతర్గత సమాచారం మొత్తం లేదా పాక్షికంగా నాశనమైందని అర్థం. కన్నీళ్లు, కోపాన్ని దిగమింగుకొని చర్చలకు రండి" అని పేర్కొంది. ఎంత మొత్తం అనేది మాత్రం వెల్లడించలేదు. నిపుణులు మాత్రం దాదాపు 5 మిలియన్ పౌండ్లు (రూ.58 కోట్లు) అడిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. కేఎన్‌పీ అంతమొత్తం చెల్లించలేని పరిస్థితిలో ఉండటంతో డేటా మొత్తం కోల్పోయింది. ఫలితంగా కంపెనీ పూర్తిగా మూతపడింది. గతంలో యూకేకు చెందిన ఎం అండ్ ఎస్, కో–ఆప్, హారోడ్స్ కూడా ఇటువంటి సైబర్ దాడులకు గురయ్యాయి. కో–ఆప్‌లో 65 లక్షలమంది డేటాను అపహరించారు. తాజాగా కేఎన్‌పీ ఘటనపై నేషనల్ సైబర్ సెక్యూరిటీ సెంటర్ సీఈవో రిచర్డ్ హార్నె స్పందించారు. "మన వ్యాపారాలు భద్రంగా ఉండాలంటే.. సిస్టమ్స్‌ను మరింత సురక్షితంగా మార్చే ఆర్గనైజేషన్లు కావాలి" అని పేర్కొన్నారు. ఇక కంపెనీలోని ఉద్యోగుల లాగిన్ పాస్‌వర్డ్ ద్వారానే హ్యాకర్లు సిస్టమ్స్‌లోకి చొరబడినట్టు కేఎన్‌పీ డైరెక్టర్ పౌల్ అబాట్ తెలిపారు. కాకపోతే ఏ ఉద్యోగి వివరాలు వాడారు అనేవి మాత్రం వెల్లడించలేదు.

# గెలిస్తేనే సిరీస్ ఆశలు సజీవం

## నేటి నుంచి భారత్-ఇంగ్లాండ్ నాలుగో టెస్ట్ - 1-2తో వెనుకంజలో టీమిండియా



ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు మంచి ప్రదర్శనే చేస్తున్నప్పటికీ సిరీస్‌లో వెనుకబడే ఉంది. ఐదు టెస్టుల టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీలో ప్రస్తుతం భారత్ 1-2తో వెనుకబడి ఉంది. ఈ నేపథ్యంతో సిరీస్‌లో అత్యంత కీలకమైన నాలుగో టెస్ట్ బుధవారం నుంచి మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో మొదలు కానుంది. సిరీస్‌ను సమం చేసి పోటీలో నిలబడాలంటే ఈ టెస్ట్‌లో గెలవడం టీమిండియాకు తప్పనిసరి. మొదటి, మూడో టెస్ట్‌ల్లో ఓడినప్పటికీ భారత ఆటగాళ్లు మెరుగ్గానే రాణించారు. టీమ్ ఇండియాకు కాస్త అదృష్టం తోడైతే ఇప్పటికే సిరీస్‌లో ఆధిక్యంలో ఉండేది. ఆటగాళ్లు ఇటు బ్యాట్‌తో, అటు బంతితో రాణించినప్పటికీ కీలక సమయాల్లో పట్టువిడిచి రెండు మ్యాచ్‌లను చేజార్చుకుని టీమిండియా 1-2తో వెనుకబడి ఉంది. లార్డ్స్ టెస్టులో చివరి వరకు పోరాడి ఓడిన టీమ్ ఇండియా ఇప్పుడు కీలక సమరానికి సిద్ధమవుతోంది. ఆతిథ్య జట్టుతో బుధవారం నాలుగో టెస్టులో తలపడనుంది. ఈ మ్యాచ్ భారత్‌కు చాలా కీలకమైనది. ఇందులో ఓడితే టీమ్ ఇండియా సిరీస్ ఆశలు గల్లంతే. ఇలాంటి తరుణంలో భారత జట్టుకు కొత్త టెన్షన్ పట్టుకుంది. ఎందుకంటే ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో టీమిండియా ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ కూడా గెలవలేదు. ఇక్కడ 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయి.. ఐదింటిని డ్రాగా ముగించింది. చివరగా 2014లో ఆడిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 54 పరుగుల తేడాతో చిత్తయింది. ఈ గణాంఆలు పక్కన బెడితే భారత జట్టుకు నైతిక స్థయిర్యం అందించే విషయం ఒకటుంది. అదే ఎన్నడూ గెలుపొందని ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో విజయం సాధించటం. ఈ సిరీస్‌కు ముందు ఎడ్జ్‌బాస్టన్‌లోనూ టీమ్ ఇండియాకు ఒక్క విజయం కూడా లేదు. కానీ ఈ సారి భారత్ అక్కడ అద్భుత విజయం సాధించింది. ఈ స్ఫూర్తితో టీమిండియా గత రికార్డులను పట్టించుకోకుండా ఓల్డ్ ట్రాఫోర్డ్ మ్యాచ్ గెలిచేందుకు సానుకూల దృక్పథంలో బరిలోకి దిగాలి. ఇప్పటివరకు చేసిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకుని సరైన వ్యూహంతో ముందుకెళ్లాలి. ముఖ్యంగా ఇంగ్లీష్ ఆటగాళ్ల కవ్వింపులతో ఆటపై ఏకాగ్రత కోల్పోకుండా చూసుకోవాలి. నోటితో సమాధానం చెబుతూనే ఆటతో వాళ్ల నోళ్లను మూయించాలి. అప్పుడే మాంచెస్టర్‌లో టీమ్ ఇండియా తొలి విజయం సాధించి సిరీస్ ను 2-2తో సమం చేస్తుంది.

**బుమ్రా ఆడతాడు: సిరాజ్**

ఇంగ్లండ్‌తో జరిగే కీలకమైన నాలుగో టెస్టుకు భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉంటాడా.. లేడా అనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే సిరీస్‌లో 1-2తో వెనుకబడిన దశలో టీమిండియాకు మాంచెస్టర్ టెస్టు చావోరేవో లాంటిది. ఇందులో గెలిస్తేనే సిరీస్ ఆశలు సజీవంగా ఉంటాయి. అలాంటి ముఖ్యమైన టెస్టుకు పనిఒత్తిడిలో భాగంగా బుమ్రాకు విశ్రాంతినివ్వడం సరికాదని విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే ఈ సస్పెన్స్‌కు పేసర్ మహ్మద్ సిరాజ్ తెర దించాడు. ఈ నెల 23 నుంచి ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే టెస్టులో బుమ్రా బరిలోకి దిగుతాడని తేల్చాడు. నాకు తెలిసినంత వరకు నాలుగో టెస్టులో బుమ్రా ఆడతాడు. గాయాల కారణంగా రోజురోజుకూ మా జట్టు బౌలింగ్ కూర్పు మారుతూ వస్తోంది. గాయంతో బాధపడుతున్న ఆకాశ్ దీప్ ఫిజియో పర్యవేక్షణలో ఉన్నాడు. సోమవారం ఉదయం తను బౌలింగ్ కూడా చేశాడు. కానీ అతడి ప్రాతినిధ్యంపై ఫిజియో నుంచి క్లియరెన్స్ రావాల్సి ఉంది. ఇంగ్లండ్ ఆటతీరును బట్టి మా బౌలింగ్ వ్యూహాలను మార్చుకుంటాం అని సిరాజ్ తెలిపాడు. బుమ్రా రాకతో జట్టు బౌలింగ్ విభాగం బలంగా మారనుంది. తాజా సిరీస్‌లో తను తొలి, మూడో టెస్టు ఆడి బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్నాడు. అలాగే చివరి టెస్టుకు అందుబాటులో ఉంచాలని ముందుగా భావించారు. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో నాలుగో టెస్టులోనే తనను ఆడించాల్సిన అవసరం ఏర్పడింది. మరోపక్క ఇంగ్లాండ్ జట్టు రెండు రోజుల ముందే తమ తుదిజట్టును ప్రకటించింది. మూడో టెస్ట్ ఆడుతూ గాయపడ్డ స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో లియామ్ డాసన్‌ను జట్టులోకి తీసుకున్నారు. డాసన్ ఎనిమిదేళ్ల తరువాత ఇంగ్లాండ్ జట్టులో చోటు దక్కించుకోవడం విశేషం.

**ఇంగ్లండ్ ప్లేయింగ్ ఎలెవన్:**

జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జామీ స్మిత్ (వికెట్ కీపర్), లియామ్ డాసన్, క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్

## భారీ రికార్డుపై రూట్ కన్ను



మాంచెస్టర్‌లోని ఓల్డ్‌ట్రాఫోర్డ్ మైదానంలో బుధవారం నుంచి భారత్‌తో నాలుగో టెస్ట్ ప్రారంభం కానుండగా ఒకేసారి మూడు స్థానాలు ఎగబాకి టెస్ట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో రెండో స్థానానికి చేరుకునేందుకు ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ సిద్ధమవుతున్నాడు. అతడు టెస్టుల్లో భారీ రికార్డుపై కన్నేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో ఉన్న రికీ పాంటింగ్, జాక్వెస్ కలిస్, రాహుల్ ద్రావిడ్లను వెనక్కినెట్టి రెండో స్థానానికి చేరడానికి రూట్ సిద్ధమవుతున్నాడు. ప్రస్తుతం రూట్ (13,259 పరుగులు) ఐదో స్థానంలో ఉన్నాడు. రూట్ మరో 31 పరుగులు చేస్తే ద్రావిడ్(13,288), కలిస్ (13,289) అధిగమిస్తాడు. అలాగే, ఈ ఇంగ్లాండ్ ఆటగాడు మరో 120 పరుగులు చేస్తే పాంటింగ్ (13,378)ను వెనక్కినెట్టి రెండో స్థానానికి వస్తాడు. భారత్‌లో మాంచెస్టర్లో జరిగే నాలుగో టెస్టులో రూట్ ఈ రికార్డు అందుకునే అవకాశముంది. మ్యాచ్ జరిగే ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో జో రూట్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. ఇక్కడ 11 టెస్టుల్లో 65.20 సగటుతో 978 పరుగులు చేశాడతను. ఇందులో ఒక సెంచరీ, ఏడు అర్ధ సెంచరీలు ఉన్నాయి.

ఇక, టెస్టుల్లో అత్యధిక పరుగుల వీరుడిగా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ (15,921) కొనసాగుతున్నాడు. సచిన్ ఆట్‌టైమ్ రికార్డును 34 ఏళ్ల జో రూట్ బ్రేక్ చేసే అవకాశాన్ని కొట్టేయలేం. అయితే రూట్ ఫిట్నెస్‌ను కాపాడుకుంటూ మరో రెండు, మూడేళ్లు కెరీర్‌ను సాగించి నిలకడగా ఆడితేనే ఇది సాధ్యమవుతుంది. ప్రస్తుతం సచిన్ రికార్డుకు రూట్ 2,663 పరుగుల దూరంలో ఉన్నాడు. ఇక, ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో రూట్ మూడు మ్యాచ్‌లూ ఆడి 253 రన్స్ చేశాడు. లార్డ్స్ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో (104), రెండో ఇన్నింగ్స్‌లో (40) రన్స్ చేశాడు.

## మైదానంలో గిల్ అనవసర దూకుడు



భారత టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మైదానంలో అనవసర దూకుడు ప్రదర్శిస్తున్నాడని టీమిండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్నాడు. దూకుడు విషయంలో విరాట్ కోహ్లిని గిల్ అనుకరిస్తున్నాడన్నాడు. అయితే విరాట్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తూనే మైదానంలో దూకుడుగా ఉండేవాడు. గిల్ దూకుడు వైఖరి అండి బ్యాటింగ్‌పై ప్రభావం చూపిస్తోందని తివారీ అన్నాడు. లార్డ్స్ టెస్ట్‌లో మూడో రోజు బ్యాటింగ్ వేళ ఇంగ్లాండ్ ఓపెనర్లు జాక్ క్రాలే, బెన్ డకెట్ సమయం వృథా చేశారు. ఈ నేపథ్యంలో ఆ బ్యాటర్లను గిల్ మైదానంలోనే విమర్శించాడు. ఈ పరిణామాలు మైదానంలో కొంత ఉత్కంఠ రేపాయి. కానీ ఈ స్లెడ్జింగ్ ఘట్టంలో చివరికి ఇంగ్లాండే పైచేయి సాధించింది. లార్డ్స్ మ్యాచ్‌ను ఆ జట్టు 22 పరుగుల తేడాతో కైవసం చేసుకొని, సిరీస్‌లో 2-1తో ముందంజలో నిలిచింది. అలాగే ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌లో పెద్దగా రాణించలేదు. మొదటి ఇన్నింగ్స్ లో 16, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 6 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ బాట పట్టాడు. అనవసరమైన దూకుడు వల్ల గిల్‌కు ప్రయోజనం దక్కలేదని మనోజ్ తివారీ అన్నాడు. అలాగే గిల్‌లో ఈ దూకుడును తాను ఐపీఎల్‌లోనూ చూశానని అతడు విశ్లేషించాడు. మైదానంలో అంత దూకుడు చూపించాల్సిన అవసరం లేదని మనోజ్ తివారీ అన్నాడు. అతడు విరాట్ కోహ్లిని అనుకరించడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ అది అతడికి బ్యాటింగ్‌లో వర్క్ అవుట్ కావడం లేదు. ఐపీఎల్‌లోనూ.. గిల్ కెప్టెన్ అయినప్పటి నుంచీ, దూకుడుగానే కనిపిస్తున్నాడు. అంపైర్లతో వాగ్వాదాలకు దిగుతున్నాడు. అది గిల్ సహజ స్వభావం కాదు. నిజానికి అతడు అంత దూకుడు ప్రదర్శించాల్సిన అవసరం లేదు. కెప్టెన్‌గా ముందుండి జట్టును నడిపించాలి.. నిజమే కానీ.. మరీ ఇంత దూకుడైతే అవసరం లేదని ఒక స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మనోజ్ తివారీ అన్నాడు..

అలాగే మైదానంలో క్రికెటర్లు ఉపయోగిస్తున్న భాష మీద కూడా అతడు తన అభ్యంతరాలను వ్యక్తంచేశాడు. కేవలం మాటలతోనే కాదు.. మ్యాచ్‌లు గెలిచి కూడా దూకుడును ప్రదర్శించవచ్చు. అలాగే మైదానంలో ఉపయోగిస్తున్న (స్టంప్స్ మైక్‌లో వినపడుతున్న) భాష, పదాలు కూడా అభ్యంతరకరంగా ఉంటున్నాయి. దీనిమీద నియంత్రణ అవసరం' అని అతడు పేర్కొన్నాడు.

## రవిశాస్త్రి ఆల్ టైమ్ టాప్-5 ఇండియన్ ఆటగాళ్లు



టీమ్ ఇండియా మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి వెల్లడించిన తన ఆల్ టైమ్ టాప్-5 గొప్ప భారత క్రికెటర్ల పేర్లలో రాహుల్ ద్రావిడ్, సౌరభ్ గంగూలీ, అనిల్ కుంబ్లే, రోహిత్ శర్మలలో ఒక్కరిని కూడా చోటు దక్కలేదు. ఇటీవల ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్లు మైకేల్ వాన్, అలిస్టర్ కుక్‌లతో కలిసి రవిశాస్త్రి ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో ఆల్ టైమ్ టాప్-5 భారత క్రికెటర్లు ఎంచుకోవాలని కోరగా.. సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి తోపాటు మహేంద్ర సింగ్ ధోనీ పేర్లను చెప్పాడు. ఈ ఐదుగురిలో 'నంబర్ వన్ ఎవరు? అని అలిస్టర్ కుక్ అడగ్గా.. 'బ్యాటింగ్ పరంగా సునీల్ గవాస్కర్ అని చెప్పాడు. ఇక కపిల్ దేవ్ అద్భుతమైన క్రికెటర్. అన్ని కోణాల్లో చూస్తే సచిన్ నంబర్ వన్. 24 ఏళ్లపాటు కెరీర్ కొనసాగించాడు. 100 సెంచరీలు చేశాడు. తన తరంలో ప్రతి దేశానికి చెందిన పేస్ బౌలింగ్ అటాక్‌ను ఎదుర్కొన్నాడు. వసీమ్ అక్రమ్, వకార్ యూనిస్, ఇమ్రాన్ ఖాన్ వంటి బౌలర్లను ఎదుర్కొంటూ కెరీర్ ఆరంభించాడు. తర్వాత స్టువర్ట్ బ్రాడ్, జేమ్స్ అండర్సన్, జాక్వెస్ కలిస్, షాన్ పొలాక్, మెక్‌గ్రాత్, బ్రెట్‌లీ వంటి పేసర్లను కాచుకుని పరుగులు చేశాడని రవిశాస్త్రి సమాధానమిచ్చాడు. భారత స్టార్ క్రికెటర్ల ఆదాయం గురించి ఇంగ్లాండ్ మాజీలు రవిశాస్త్రిని ప్రశ్నించగా.. కచ్చితంగా ఎంత మొత్తం సంపాదిస్తున్నారో తెలియదని, కానీ అది దాదాపు ఏడాదికి రూ.100 కోట్లు ఉంటుందని రవిశాస్త్రి అన్నాడు. ధోనీ, విరాట్ కోహ్లి వంటి పెద్ద స్టార్లు 15-20 ప్రకటనలు చేస్తారని, తద్వారా భారీగా డబ్బు సంపాదిస్తారని పేర్కొన్నాడు.

## యువతలో తగ్గుతున్న ఫిట్‌నెస్ స్థాయిలు

దేశంలోని యువతలో ఫిట్‌నెస్ స్థాయిలు తగ్గుతున్నాయని టీన్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఆందోళన వ్యక్తం చేశాడు. ధోనీ 2020లోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినా ఇంకా ఫిట్‌నెస్ కాపాడుకుంటూ ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. 44ఏళ్ల వయసులోనూ ధోనీ మైదానంలో చాలా చురుగ్గా ఉంటున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో వికెట్ల వెనక మెరుపు వేగంతో కదులుతూ రెప్పపాటులో స్టంపింగ్‌లు చేసి ఔరా అనిపించాడు. ఫిట్‌నెస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే ధోనీ ఇటీవల రాంచీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా భారతీయులు, ముఖ్యంగా యువతలో ఫిట్‌నెస్ స్థాయిలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రజల్లో శారీరక శ్రమ తగ్గుతోంది. భారతీయుల సగటు ఫిట్‌నెస్ లెవల్ కూడా తగ్గింది. నాకు తెలిసినంత వరకు నా కూతురు కూడా పెద్దగా శారీరక శ్రమ చేయదు. ఆమెకు క్రీడలంటే ఇష్టం లేదు. అలాగే, చాలామంది క్రీడలకు దూరంగా ఉంటున్నారు. మనం ఫిట్‌గా ఉండాలంటే శారీరకంగా శ్రమించాలి. అందుకోసం వివిధ రకాల పనులు చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ధోనీ సూచించాడు.

## కాజోల్, ట్వింకిల్.. టూమచ్!

ఒకప్పుడు టెలివిజన్ వేదికగా ట్రెండ్ సృష్టించిన టాక్–షోలకు ఇప్పుడు ఓటీటీలు వేదికలవుతున్నాయి. సరికొత్త అంశాలు, ప్రజెంటేషన్‌తో టాక్ షోలు ముందుకు వస్తున్నాయి. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి మరో టాక్ షో సిద్ధమవుతోంది. బాలీవుడ్ కథానాయికలు కాజోల్, ట్వింకిల్ ఖన్నా వ్యాఖ్యాతలుగా వ్యవహరించనున్న షో‘టూమచ్’. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ షో స్ట్రీమింగ్ కానుంది. బాలీవుడ్ నటులతోపాటు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు ఈషోకు రానున్నారు.వ్యక్తిగత జీవితాలతో పాటు, కెరీర్‌లో వాళ్లుఎదుర్కొన్న ఎత్తుపల్లాలను,వాళ్ల బంధాలను ఇలా




చాలా విషయాలపై ఈ షోలో మాట్లాడనున్నారు. త్వరలోనే ఈ షో స్ట్రీమింగ్ తేదీని అమెజాన్ ప్రైమ్ వీడియో ప్రకటించనుంది.

## కొంచెం స్పేస్ కావాలి!

‘ఏదీ శాశ్వతం కాదు. కాలం కూడా గడిచిపోతుంది. మళ్లీ కలుద్దాం’ అంటూ యాంకర్ రష్మి ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టి సంచలనం రేపారు. కొన్నాళ్ల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారట. “హలో ఆల్.. నెలపాటు డిజిటల్ డీటాక్స్ కోరుకుంటున్నా. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఒడుదొడుకులన్నాయి. సోషల్ మీడియా అందులో భాగమే. కొన్నిసార్లు అది మన ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. ఒక విషయమైతే వాగ్దానం చేస్తున్నా. కచ్చితంగా మరింత దృఢంగా తిరిగి వస్తా. నేను నా శక్తియుక్తులను పునరుద్ధరించుకోవాలి. ఎలాంటి ప్రేరణ, డిజిటల్ ప్రభావం లేకుండా ఆత్మపరిశీలన చేసుకోవాలి. నేనెప్పుడూ బలంగా ఉంటానని అందరూ అనుకుంటారు. కానీ కొన్నిసార్లు కుంగిపోతున్నాను. కొన్ని విషయాలను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయం. అందుబాటులో ఉన్నా లేకున్నా, మీ ప్రేమ మద్దతు కొనసాగుతుందని ఆశిస్తున్నా”అంటూ ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు రష్మి. సరదాగా నవ్వుతూ నవ్విస్తూ ఫొటోలను పంచుకునే రష్మి.. సడెన్‌గా



ఇలాంటి పోస్ట్ చేయడంతో కొందరు ఫ్యాన్స్ ఏమైందంటూ ఆరా తీస్తున్నారు. బలంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ ఆమె పోస్ట్ కింద కామెంట్లు పెడుతున్నారు. వారంలో ఒకటి రెండు రోజులు మొబైల్‌కు దూరం గా ఉండటమే ‘డిజిటల్ డీటాక్స్’.

# కలిసొస్తేనే.. వీరమల్లు-2



‘హరి హర వీరమల్లు: పార్ట్2’ షూటింగ్ 20–30 శాతం పూర్తయిందని అగ్ర కథానాయకుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కన్ఫర్మ్ చేశారు. ఆయన కీలక పాత్రలో నటించిన ‘హరిహర వీరమల్లు: పార్ట్–1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్ జులై 24న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా మంగళగిరిలో మీడియాతో ముచ్చటించారు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ ‘పార్ట్–2’ను వచ్చే డబ్బులు, తనకున్న సమయాన్నిబట్టి చేస్తామన్నారు. అందుకు భగవంతుడి ఆశీస్సులు కూడా కావాలని సమాధానమిచ్చారు. చిత్ర పరిశ్రమ ఎక్కడున్నా సమస్య లేదని, ఆంధ్రలో మౌలిక సదుపాయాలతోపాటు ఫిల్మ్ మేకింగ్ స్కూల్ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. “ఇక్కడి నుంచి బలవంతంగా తీసుకెళ్లిపోయిన కోహినూర్ వజ్రాన్ని తీసుకొచ్చే వీరుడి కథ ఇది. హరి హర వీరమల్లు’ పూర్తి ఫిక్షనల్ స్టోరీ. ‘సర్వాయి పాపన్న’ కథతో సంబంధం లేదు. రెండుసార్లు కరోనా కష్టాలు, తర్వాత ఏపీలో రాజకీయ డిజాస్టర్‌వల్ల సినిమాలపై దృష్టి పెట్టలేకపోయాను. దీంతో నిర్మాతలు ఇబ్బంది పడ్డారు. దానికి నైతిక బాధ్యత వహించి ప్రమోషన్ చేస్తున్నా. ఈ మూవీకి రెమ్యునరేషన్ కూడా లేదు. (నవ్వులు) ‘జిజియా పన్ను’పై ఎపిసోడ్ ఉంటుంది. అదే సమయంలో రాజకీయాలకు అతీతంగా ఉంటుంది. దానిలో ధర్మం అనేది ఒక ఎలిమెంట్ మాత్రమే. సినిమాలా? రాజకీయాలా? అంటే మొదటి ప్రాధాన్యం రాజకీయాలకే. భీమ్లా నాయకు టికెట్ ధరలు తగ్గించినప్పుడు నేను, నిర్మాత ఇద్దరం నష్టపోయాం. సినిమా బాగుందంటే ఆనందిస్తా. బాగోలేకపోతే ఎక్కడ తప్పుజరిగిందో పరిశీలిస్తా. సినిమా విడుదలైన తర్వాత ఎప్పుడూ ఒంటరిగానే ఉంటా. నా ఎమ్మెల్యేలు అందరికీ వాళ్లు కోరుకుంటే ప్రత్యేక షోవేస్తాం. ఫిల్మ్ ఇండస్ట్రీ చాలా గ్లామరస్‌గా కనిపిస్తుంది. వరుస విజయాల తర్వాత‘జానీ’ చేస్తే ఆడలేదు. ఫైనాన్షియర్లు అందరూ ఇంటికొచ్చారు. పారితోషికం తిరిగిచ్చేశా.మరో రూ.15 లక్షలు అప్పులు చేసి మరీ ఇచ్చాను. కానీ, ఆ సినిమా రాజకీయాల్లో ఉపయోగపడింది. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు బలంగా నిలబడ్డా. కిందిస్థాయి నుంచి కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి ఏఎం రత్నం. ఆయనకు అండగా నిలబడాలనే ఈ సినిమాను దగ్గరుండి విడుదల చేస్తున్నా” అని పవన్ అన్నారు.

## అవతార్‌లో వరంగ్ ఇలా..

జేమ్స్ కామెరూన్ తెర కెక్కించిన విజువల్ వండర్ ‘అవతార్’.దీని రెండు భాగాలు అత్యధిక ప్రేక్షకాదరణను పొంది రూ.కోట్లు వసూలు చేశాయి. మూడో భాగం ‘అవతార్ – ఫైర్ అండ్ యాష్’ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్నప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఎన్నో రోజుల తర్వాత తాజాగా ఈ సినిమా అప్డేట్‌ను టీమ్ పంచుకుంది. ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. బ్రిటిష్ నటి ఊనా చాప్లిన్ పోషించిన వరంగ్ పాత్రను పరి చయం చేస్తూ ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే సినిమా మొదటి ట్రైలర్ కూడా జులై 25న‘ది ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్’ సినిమాతోపాటు రిలీజ్ చేయనున్నట్టు తెలిపారు. థియే టర్లలో ఈసినిమా ప్రదర్శనకు ముందు అవతార్ 3ట్రైలర్‌ను ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ఇక డిసెంబర్ 19న ‘అవతార్–ఫైర్ అండ్ యాష్’ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రపంచ చిత్ర పరిశ్రమలో‘అవతార్’ ఓసంచలనం.హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ఓఅద్భుత ప్రపంచమిది. పండోర అనే కల్పిత గ్రహాన్ని సృష్టించి అందులోని ప్రకృతి అందాలను కళ్లు చెదిరే



విజువల్ ఎఫెక్ట్స్ అందరినీ కట్టిపడేశారు దర్శకుడు. ఆ తర్వాత ‘అవతార్:దివే ఆఫ్‌వాటర్’మంచి ట్రీట్‌ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 160భాషల్లో విడుదలైన ఆ సీక్వెల్ బాక్సాఫీసు కలెక్షన్లను కొల్లగొట్టింది. ఆ ఫ్రాంచైజీలో రానున్న మూడో భాగాన్ని పంచభూతాల్లో ఒకటైనఅగ్నికి సంబంధించిన కాన్సెప్ట్‌తో రానుంది. అవతార్ ఫ్రాంచైజీలో రానున్న‘అవతార్ 4’2029లో, చివరిగా రానున్న ‘అవతార్ 5’డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించినసంగతి తెలిసిందే.

## ఉస్తాద్‌తో రాశిఖన్నా కూడా..



పవన్ కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో తెరకెక్కుతున్న చిత్రం ‘ఉస్తాద్ భగత్‌సింగ్’. శ్రీలీల కథానాయిక. తాజాగా మరో బ్యూటీ రాశీఖన్నా సైతం భాగమైనట్టు దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ‘శ్లోక పాత్రతో రాశిఖన్నా సినిమాకు మరింత అందాన్ని తేనుంది. ప్రస్తుతం షూటింగులో పాల్గొంటుంది’ అంటూ దర్శక నిర్మాతాలు పేర్కొన్నారు. శ్రీలీల, రాశిఖన్నా అందాలతో పవన్ ఫ్యాన్స్‌కి ఫీస్ట్ ఇవ్వనున్నారన్న మాట వినిపిస్తోంది. గబ్బర్‌సింగ్ తర్వాత పవన్ కల్యాణ్–హరీశ్ శంకర్ కాంబోలో రూపొందుతోన్న చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలే పెట్టుకున్నారు. పవన్ పోలీస్ పాత్రలోనే కనిపించనున్నాడు. పవన్ నటించిన ‘హరిహర వీరమల్లు’ జులై 24న విడుదలవుతోంది. ఈసందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్ లుక్కుకు అంతా ఫిదా అయ్యారు. దీనిపై ఓ అభిమాని పెట్టిన పోస్ట్‌కు హరీశ్ సరదాగా రిప్లై ఇచ్చారు. “పవన్ ఉస్తాద్ లుక్ అదిరిపోయింది. ఓ అభిమానిగా హరీశ్ శంకర్ ఆయన్ని అద్భుతంగా చూపించనున్నారని అర్ధమవుతోంది” అని పోస్ట్ పెట్టారు. దీనికి దర్శకుడు రిప్లై ఇస్తూ.. ‘తరతరాలుగా.. నరనరాల్లో ఆయనపై అభిమానం ఉప్పొంగుతోంది’ అన్నారు.

## ఈ అనుబంధం ఏనాటిదో..!

ఐదు దశాబ్దాలకుపైగా రజనీతో తనకుఅనుబంధముందని చెప్పుకొచ్చారు నటుడు మోహన్‌బాబు. రజనీతో తనకున్న స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ “గొప్ప వ్యక్తిత్వమున్న మనిషి. 50ఏళ్ల అనుబంధం మాది. ‘బ్లడీ తలైవా’ అని ముద్దుగా పిలిచేంత చనువుంది మామధ్య. 50 ఏళ్ల క్రితం మావద్ద ఏమీ లేనప్పుడు, మద్రాసు ఫ్లాట్‌ఫామ్‌పై మొదటిసారి కలిశాం. ఇప్పుడు రోజులో 3, 4 సార్లైనా మెసేజ్ చేసుకుంటాం. ఇటీవల కలిసినప్పుడు రజనీ ఒకమాట చెప్పాడు. ‘నాకు గతంలో ఎంత కోపముండేదో నీకు తెలుసు. నేను తర్వాత కాలంలో దాన్ని వదిలేశాను. నువ్వెందుకు వదల్లేకపోతున్నావు. పుస్తకాలు చదవడం కాదు.. అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని కోపాన్ని వదిలెయ్’ అని సలహా ఇచ్చాడు” అని మోహన్ బాబు గుర్తు చేసుకున్నారు. ఈమధ్యే విడుదలైన ‘కన్నప్ప’ చిత్రంలో కనిపించారు మోహన్‌బాబు. అందులో వాయులింగాన్ని కాపాడుకుంటూ వస్తున్న మహాదేవశాస్త్రి పాత్రలో మెప్పించారు.





## భైరవం.. గ్రేట్ ఫీట్!

టాలీవుడ్‌లో తెరకెక్కిన రీసెంట్ మల్టీస్టారర్ చిత్రం ‘భైరవం’. బాక్సాఫీస్ దగ్గర డీసెంట్ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాను దర్శకుడు విజయ్ కనకమేడల డైరెక్ట్ చేయగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటించారు. ఈ సినిమా థియేట్రికల్ రన్ తర్వాత రీసెంట్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో చిత్రం స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమాకు ఓటీటీలో కూడా మంచి రెస్పాన్స్ లభిస్తుంది. తాజాగా సాలిడ్ ఫీట్ క్రియేట్ చేసింది. గ్లోబల్‌గా నెంబర్ 1 స్థానంలో ఈ చిత్రం జీ5లో ట్రెండింగ్ అవుతున్నట్టు మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాలోని యాక్షన్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ లభిస్తుందని అంటున్నారు. ఇలా ఓటీటీలో భైరవం మంచిరెస్పాన్స్‌తో దూసుకెళ్తుండటంతో చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తంచేస్తున్నారు.ఇక ఈ సినిమాలో అదితి శంకర్, ఆనంది,దివ్య పిళ్లై తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించగా కెకె రాధామోహన్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు.